సోమవారం
18-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 176
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆ వైద్యుడికి రూ.1.27 కోట్ల జరిమానా

లక్నో: వైద్యుడి నిర్లక్ష్యం ఓ యువకుడి ప్రాణాలు తీసిన ఘటన ఉత్తరప్రదేశ్, లక్నోలో జరిగింది. దీంతో వినియోగదారుల ఫోరం ఆ వైద్యుడికి రూ.1.27 కోట్ల జరిమానా విధించింది. 2015 జులై 20 నుంచి 12శాతం వార్షిక వడ్డీతో కలిపి నెలరోజుల్లో రూ.1.27కోట్లు చెల్లించాలని స్పంచేసింది. ఫతేపూర్‌కు చెందిన జ్ఞాన్‌దేవ్ శుక్లా కుమారుడు శివమ్ 2015లో కడుపునొప్పితో లోహియా ఆసుత్రిలో చేరితే, పిత్తాశయంలో రాళ్లు ఉన్నందున శస్త్రచికిత్స చేయాలని డాక్టర్ అరుణ్‌కుమార్ చెప్పారు. ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌కు వెళ్లాలని సూచించారు. అక్కడ రూ.40వేల వరకు వసూలుచేసి శివమ్‌కు తప్పుడు ఆపరేషన్ చేయడంతో శివమ్ మృతిచెందాడు.

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

బిక్షాటన చేస్తూ.. గడ్డి తింటూ.. మెడకు ఉరితాళ్లు బిగించుకుని... నిరసన

నేడు ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసనలు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు తమ డిమాండ్ల సాధన కోసం ఆదివారం వినూత్న పద్ధతుల్లో ప్రభుత్వానికి నిరసనలు తెలిపారు. ఆరోవ రోజు ఆందోళనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులైన విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసిన తాము ఎందుకు సమ్మె చేస్తున్నామో, ప్రభుత్వం తమకు చేస్తున్న అన్యాయం, పనిభారం తదితర అంశాలను వివరించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ), ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ),ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)తో కూడిన జేఏసీ ఆధ్వర్యంలో వివిధ జిల్లాలో నిరసన ప్రదర్శనలు చేశారు.

సత్యసాయి జిల్లా హిందూపురంలో అంగన్‌వాడీలు గడ్డి తింటూ నిరసన తెలిపారు. రేపల్లెలో సోది చెప్పించుకున్నారు... బాపట్ల జిల్లా చీరాలలో విద్యార్థులు పలకలపై జగన్ మామయ్య మా టీచర్‌కు జీతాలు పెంచండి...అంటూ నిరసన తెలిపారు. నంద్యాల జిల్లా చాగలమర్రిలో భిక్షాటన చేశారు. కృష్ణాజిల్లా చల్లపల్లిలో చెవిలో పూలు పెట్టుకుని దీక్షలో పాల్గొన్నారు. ఏలూరులో కళ్లు, చెవులు, నోరు మూసుకుని నిరసన వ్యక్తం చేశారు.చిత్తూరులో మానవ హారం నిర్వహించారు. కార్వేటినగరంలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో పొర్లు దండాలు పెట్టి మెట్లపై నిరసన వ్యక్తం చేశారు. కర్నూలులో

- మిగతా 2 లో

అంగన్‌వాడీల కోసం మరిన్ని పోరాటాలు : ముప్పాళ్ల

అంగన్‌వాడీల కోసం మరిన్ని పోరాటాలు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరుజిల్లా తాడికొండలో అంగన్‌వాడీల దీక్ష శిబిరాన్ని ఆదివారం ముప్పాళ్ల సందర్శించి దీక్షకు సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు, హెల్పర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ రూపాలలో అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళనలు

- మిగతా 2 లో

లింగ అసమానతలు పరిష్కరించే చట్టాలు కావాలి

సీజేఐ చంద్రచూడ్

బెంగళూరు: లింగ అసమానతలను పరిష్కరించే చట్టాలు అవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ నొక్కిచెప్పారు. ఇళ్లల్లోనే అసమానతలను పరిష్కరించాలని, హక్కుల ఉల్లంఘనకు గోప్యత సాకు కాదని అన్నారు. సుప్రీంకోర్టు 19వ ప్రధాన న్యాయమూర్తి ఈఎస్ వెంకటరామయ్య శతాబ్ది స్మారకోపన్యాసాన్ని సీజేఐ చంద్రచూడ్ ఆదివారం బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీలో చేశారు. ఈ సందర్భంగా లింగ అసమానతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇళ్లు వ్యక్తిగత స్థలాలే కానీ అందులో ఉండే వారికి సముచిత స్థానాన్ని ఇవ్వలేవని సీజేఐ అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత జీవితం ఫలప్రదంగా ఉంటే ప్రజా జీవితం బాగుంటుందని చెప్పారు. కోర్టులు గతంలో పెళ్లిళ్లకు ప్రాధాన్యత ఇచ్చేవని, వ్యక్తుల హక్కుల కంటే వ్యవస్థల పరిరక్షణ ముఖ్యమని భావించేవని తెలిపారు. గృహిణి తన సేవకు వేతనం పొందని స్థలమే ఇల్లు అని సీజేఐ అన్నారు. వివిధ రంగాల్లో వృత్తిపరంగా మహిళలు గణనీయమైన కృషి చేసినప్పటికీ పురుషులతో సమాన వేతనాలు పొందడంలేదని చెప్పారు. సమగ్రమైన, రాజ్యాంగబద్ధంగా పాలించే సమాజం పబ్లిక్, ప్రైవేటు అనే కోణాన్ని దాటి చూడాలని, చాలా ఏళ్లుగా పబ్లిక్, ప్రైవేట్ అనే భావన చట్టాలపై స్త్రీవాద, ఆర్థిక విమర్శలకు ఆధారమని చెప్పారు. వాక్ స్వాతంత్ర్యం మనుగడ సాగించాలంటే అది వ్యక్తిగత-బహిరంగ ప్రాంతాల్లో ఉండాలని అన్నారు. పనిప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొనే వివక్షను ప్రస్తావిస్తూ లింగ వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలని సూచించారు. ఇంట్లో పనిచేసే నౌకర్లకు కార్పొరేట్ ఉద్యోగుల వలే ప్రయోజనాలు ఉండవన్నారు. వ్యక్తి ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడు న్యాయకోణంలోనూ పరివర్తనం వస్తుందని అభిప్రాయపడ్డారు. భారతీయ శిక్షాస్మృతిలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గొడవ పడి శాంతికి భంగం కలిగిస్తే అది నేరంగా పరిగణిస్తారని సీజేఐ చెప్పారు. బహిరంగ ప్రదేశంలో గొడవ జరిగినప్పుడు మాత్రమే శిక్షార్హులవుతారన్నారు. అటువంటి పరిస్థితిలో గొడవ వల్ల కలిగిన నష్టాల కంటే కూడా అది ఎక్కడ జరిగిందనే దానికి చట్టం అధిక ప్రాధాన్యత ఇస్తుందని సీజేఐ చంద్రచూడ్ చెప్పారు.

లిబియాలో 60 మందికిపైగా జలసమాధి 2లో

అమరావతి ఉద్యమానికి నాలుగేళ్లు

- తుళ్లూరులో సర్వమత ప్రార్థనలు
- రైతులు, మహిళల జెండా వందనం
- మూడు రాజధానులతో జగన్ మోసం : రైతులు
- 1,461 రోజులకు చేరిన ఉద్యమం
- జగన్ తప్పులు సరిచేస్తాం : చంద్రబాబు ట్వీట్

తుగ్లక్ నిర్ణయానికి నాలుగేళ్లు

- జగన్ మూడు ముక్కలాట
- ఉద్యమకారులకు జేజేలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

2లో

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అమరావతి రాజధాని పరిరక్షణ ఉద్యమానికి నాలుగేళ్లు పూర్తయింది. ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలని నాలుగేళ్లుగా రైతులు, మహిళలు ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. 2019లో సీఎం వైఎస్ జగన్ తీసుకున్న మూడు రాజధానుల ప్రకటనకు వ్యతిరేకంగా అమరావతి ఉద్యమం ప్రారంభమైంది. మూడు రాజధానుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తూ, విభిన్న రూపాల్లో ప్రభుత్వంపై నిరసనలు

- మిగతా 2 లో

అమరావతి కోసం ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాలి

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-తుళ్లూరు : అమరావతి రాజధాని సాధన కోసం, కౌలు సొమ్ము కోసం అవసరమైతే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేసి ఆదివారంతో నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తుళ్లూరు రైతు దీక్షా శిబిరంలో ముప్పాళ్ల మాట్లాడారు. మహమ్మారి కరోనాని కూడా ఖాతరు చేయకుండా అవిశ్రాంతంగా, విరామం లేకుండా ఏదో ఒక రూపంలో 1,461 రోజులుగా చేస్తున్న అమరావతి రాజధాని పరిరక్షణ మహోద్యమం తుది దశకు

- మిగతా 2 లో

కేరళ అనిశ్చితికి గవర్నర్ యత్నం

- ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొట్టే ప్రయత్నాలు
- ప్రొటోకాల్ ఉల్లంఘనలు
- స్థాయి మరిచి వ్యాఖ్యలు-చర్యలు
- ఇక కేంద్రం దృష్టి పెట్టాల్సిందే: విజయన్

పఠాన్‌మిట్ట: కేరళలో అనిశ్చితి సృష్టించేందుకు రాష్ట్ర గవర్నర్ యత్నిస్తున్నారని, ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని, పదేపదే ప్రొటోకాల్ ఉల్లంఘిస్తూ, స్థాయిని మరిచి వ్యాఖ్యలు చేస్తున్నారని ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ యోగ్యత, ఆయన చర్యల ఔచిత్యమును కేంద్రప్రభుత్వం పరిశీలించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎల్డీఎఫ్ ప్రభుత్వ 'నవకేరళ సదస్' కార్యక్రమం క్రమంలో ఆదివారం

- మిగతా 2 లో

మౌనం వీడిన మోదీ

- పార్లమెంటు భద్రతా వైఫల్యంపై ఎట్టకేలకు స్పందన
- ఇది తీవ్రమైన అంశమన్న ప్రధాని
- రాద్ధాంతం వద్దంటూ విపక్షాల తీరుపై విమర్శ

న్యూఢిల్లీ: పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై ప్రధాని మోదీ ఎట్టకేలకు స్పందించారు. డిసెంబరు 13న జరిగిన ఘటనపై 17వ తేదీన ఆయన స్పందించారు. ఇది తీవ్రమైన అంశమన్నారు. అదే సమయంలో రాద్దాంతం చేయొద్దు అంటూ చట్టసభల్లో విపక్షాల నిరసనలనుద్దేశించి వ్యాఖ్యానించారు. తాజా ఘటనపై దర్యాప్తు సంస్థలు విచారిస్తున్నాయని మోదీ తెలిపారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటులో మరోమారు భద్రతా వైఫల్యం వంటివి జరగకుండా కఠిన చర్యలను సంబంధిత అధికారులు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకు కారణమైన వారి గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలని, వారి ఉద్దేశాలు, లక్ష్యాలను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఐతే ఇది కూడా మన చేతిలోకి వచ్చేసినట్లేగా సార్!

కర్మాగారంలో పేలుడు

9 మంది మృతి

మరో ముగ్గురికి గాయాలు

నాగపూర్ జిల్లాలో ఘటన

నాగపూర్ : మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో ఆదివారం జరిగిన పేలుడులో తొమ్మిది మంది మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. బజార్‌గావ్ ప్రాంతంలోని సోలార్ ఇండస్ట్రీస్‌కు చెందిన కాస్ట్ బూస్టర్ యూనిట్‌లో ఉదయం 9 గంటలకు పేలుడు సంభవించిందని పోలీసు ఉన్నతాధికారి ఒకరు పీటీఐకి వివరించారు. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి

- మిగతా 2 లో

వెయ్యి కోట్ల టీడీఆర్‌కు కుట్ర!

- అవసరం లేని దస్పల్లా రహదారి విస్తరణ పేరుతో భారీ దందా
- ప్రభుత్వ సర్క్యూట్ హౌస్, జీవీఎంసీ వాటర్ ట్యాంకులను ప్రైవేటు ఆస్తిగా గుర్తింపు
- మరో వెయ్యి కోట్లు లాగే ప్రయత్నం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖలో తాజాగా టీడీఆర్‌ల పేరిట భారీ దందా కొనసాగుతోంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కొంతమంది రోడ్డు అభివృద్ధి ప్లాన్లు చూపించి అక్రమమార్గంలో టీడీఆర్‌లు పొందుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో మరో భారీ టీడీఆర్‌ల స్కామ్‌కు తెరలేచింది. దస్పల్లా హిల్స్‌లో ప్రస్తుతం ఉన్న రహదారి అలాగే ఉంటే అక్కడ ఐదు అంతస్తులకు మించి భవన నిర్మాణానికి అవకాశం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడి జీవీఎంసీతో 100 అడుగుల రహదారి విస్తరణకు నోటిఫికేషన్ ఇప్పించారు. 100 అడుగుల రహదారి కారణంగా విజయసాయి రెడ్డి బృందం లబ్ధి పొందే ఎస్యూర్ ఎస్టేట్స్‌తో ఆ విస్తరణకు సంబంధించిన భూమిని బహుమతిగా ఇప్పించవచ్చు. ప్రస్తుతం అక్కడ గజం విలువ రూ.98 వేలు ఉంటే దానిని రూ.2 లక్షలకు పెంచి టీడీఆర్‌ని కొట్టేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. గతంలో జిల్లా కలెక్టర్ మల్లికార్జున్ సబ్ డివిజన్ చేసిన టౌన్ సర్వే రికార్డులను ప్రాతిపదికగా తీసుకోవాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా పాత సర్వే నంబర్లతో జీవీఎంసీతో నోటిఫికేషన్ ఇప్పించారు. అంటే ఇందులో దశాబ్దాల నాటి సర్క్యూట్ హౌస్, పార్క్ స్థలాలు, జీవీఎంసీ వాటర్ ట్యాంకులను, ఇతర

- మిగతా 2 లో

హమాస్‌కే యువ అమెరికన్ల మొగ్గు

- పలస్తీనాకు ఇజ్రాయిల్‌ను ఇచ్చేయాలన్న 51శాతం మంది
- అక్టోబరు 7 దాడిని సమర్థించిన 18-24 ఏళ్ల వారు
- హార్వర్డ్-హారిస్ సర్వేలో వెల్లడి

8లో

60 మందికిపైగా జలసమాధి

లిబియా తీరంలో ఘోర పడవ ప్రమాదం

ప్రయాణికులంతా ఆఫ్రికన్లు

ట్రిపోలి: లిబియా తీరంలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. 60 మందికి పైగా జల సమాధి అయ్యారు. వలసదారులతో యూరప్‌కి బయల్దేరిన పడవ లిబియా తీరం వద్ద నీట మునిగినట్లు ఐక్యరాజ్య సమితికి చెందిన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం) తెలిపింది. మధ్యధరా సముద్రంలో వెళ్తున్న పడవ లిబియా పశ్చిమ తీరంలోని జువారా పట్టణం వద్దకు వచ్చినప్పుడు బలమైన అలల తాకిడికి కొట్టుకుపోయినట్లు ఐఓఎంకు చెందిన లిబియా కార్యాలయం తెలిపినట్లు ఓ ప్రకటన వెలువడింది. ఈ మేరకు ప్రమాదం నుంచి బయటపడిన వలసదారులు వెల్లడించినట్లు పేర్కొంది. ప్రమాదం జరిగినప్పుడు పడవలో మహిళలు, పిల్లలు సహా 86 మంది ఉండగా 61 మంది నీట మునిగినట్లు వారు తెలిపారు. ప్రయాణికులు నైజీరియా, గాంబియా, ఇతర ఆఫ్రికా దేశాలకు చెందిన వారని చెప్పారు. దీనిని ఉత్తర ఆఫ్రికాకు సంబంధించి అతిపెద్ద విపత్తుగా ఐఓఎం పేర్కొంది. ఈ ఘటనలో 25 మంది సురక్షితంగా బయట పడగా వారిని లిబియా డిటెన్షన్ సెంటర్‌కు పంపినట్లు తెలిపింది. వారంతా ఆరోగ్యంగానే ఉన్నట్లు వైద్య నివేదికలు తెలిపినట్లు వెల్లడించింది. మెరుగైన జీవితాన్ని ఆశిస్తూ చాలా మంది ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలస వెళుతుంటారు. వీరంతా ప్రమాదకరమైన ఈ సముద్ర మార్గంలో పడవల్లో ప్రయాణిస్తారు. లిబియా, టునీషా ప్రధాన రవాణా కేంద్రాలుగా ఉన్నాయి. ఈ ఏడాది టునీషియా, లిబియా నుంచి ఇటలీకి 1,53,000 మందికిపైగా వలస వచ్చినట్లు ఐరాస శరణార్థి సంస్థ వెల్లడించింది. అక్రమ వలసలను నిలువరిస్తానన్న హామీ కారణంగానే జార్జియా మెలోనికి ఇటలీ ప్రధానిగా ఎన్నిక కాగలిగారు. ఇదిలావుంటే, ఈ ఏడాది మధ్యధర సముద్రంలో ప్రయాణిస్తూ దాదాపు 2,250 మంది వలసదారులు మృతి చెందినట్లు ఐఓఎం నివేదికలు తెలుపుతున్నాయి. లిబియాలోని కల్లోల పరిస్థితులు మానవ అక్రమ రవాణాదారులకు అనుకూలంగా మారాయి.

కువైట్ అమీర్‌కు కన్నీటి వీడ్కోలు

అధికార లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు

కువైట్ సిటీ: కువైట్ అమీర్ షేక్ నవాఫ్ అల్ అహ్మద్ అల్ సబా అంత్యక్రియలు అధికార లాంఛనాలతో ముగిశాయి. షేక్ నవాఫ్‌కు కుటుంబ సభ్యులు, అభిమానాలు ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. షేక్ నవాఫ్ శవపేటికపై కువైట్ జెండా కప్పి, ముస్లిం సంప్రదాయం ప్రకారం బిలాల్ బిన్ రబా మసీదులో ప్రార్థనలు నిర్వహించి, సులైబిఖాత్ శ్మశానవాటికలో ఆయనను ఖననం చేశారు. షేక్ నవాఫ్ మరణానికి ప్రపంచ దేశాధినేతలు సంతాపం ప్రకటించారు. షేక్ నవాఫ్ ఆరు దశాబ్దాల ప్రజా జీవితాన్ని గడిపారు. రక్షణ, అంతర్గత, కార్మిక శాఖల మంత్రిగా పనిచేశారు. నేషనల్ గార్డ్ డిప్యూటీ చీఫ్‌గానూ సేవలు అందించారు. కువైట్ అమీర్‌గా కేవలం మూడేళ్లు పగ్గాలు చేపట్టారు. సుమారు నెల రోజులకుపైగా అనారోగ్యంగా ఉన్న ఆయన శనివారం మరణించారు. షేక్ నవాఫ్ రాజకీయ వారసుడిగా షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ సబా పాలనా బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రముఖ తత్వవేత్త ఆంటోనియో నెగ్రీ మృతి



పారిస్: ఇటలీకి చెందిన తత్వవేత్త ఆంటోనియో నెగ్రీ (90) పారిస్‌లో కన్నుమూశారు. 1969లో పొటెరే ఓపెరాయి (వర్కర్ పవర్) గ్రూపును స్థాపించారు. ఆంటోనోమియా ఓపెరాయా ప్రముఖ సభ్యుడిగా ఉన్నారు. విప్లవాత్మక స్పృహను ప్రభావితం చేసే పుస్తకాలు అనేకం రాశారు. స్వయంప్రతిపత్తిని ఉద్బోధించే రచనలతో ప్రాచుర్యం పొందారు. 1978 మేలో ఆల్డో మొరో అపహరణకు సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొన్నారు. రెడ్ బ్రిగేడ్స్ (బ్రిగాటె రోసె) వామపక్ష తీవ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నట్లు కూడా ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో 1984లో 30ఏళ్ల జైలు శిక్ష పడింది.

1960 దశకంలో 1970లో రాజకీయ హింసకు నైతిక బాధ్యత వహించి ఆరోపణలతో మరో నాలుగేళ్ల శిక్ష కూడా పడింది. దీంతో నెగ్రీ ఫ్రాన్స్‌కు పారిపోయి పారిస్-(విన్సెన్నెస్), కాలేజి ఇంటర్నేషనల్ డీ ఫిలసఫీలో అధ్యాపకునిగా పనిచేశారు. 1997లో ఈయన కేసు విచారణకు రాగా శిక్షా కాలాన్ని 30 నుంచి 13ఏళ్లకు తగ్గించడంతో ఇటలీకి తిరిగి శిక్షను పూర్తి చేశారు. చివరి రోజుల్లో డెమొక్రసీ ఇన్ యూరప్ మూవ్‌మెంట్ 2025ను ప్రచారం చేశారు. ఇది సామాజిక ప్రజాస్వామిక సంఘం. దీనిని గ్రీక్ ఆర్థిక శాఖ మాజీ ంత్రి యానిస్ వరౌఫాకిన్స్ ఏర్పాటు చేశారు.

విశాలాంధ్ర ప్రపంచం

కర్మాగారంలో పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

చెందారని తెలిపారు. ఇక్కడికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న యూనిట్‌లో ఈ ఘటన చోటుచేసుకుందని, దీంతో భవనానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, పేలుడు జరిగిన సమయంలో యూనిట్‌లో 12 మంది కార్మికులు ఉన్నారని కొండాలి పోలీసు స్టేషన్‌లోని అధికారి తెలిపారు. ఇదిలాఉండగా, మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో, ఈ సంఘటన దురదృష్టకరమని, తొమ్మిది మంది మృతికి సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుందని, ఈ నిర్ణయానికి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆమోదించారని పేర్కొన్నారు. సోలార్ ఇండస్ట్రీస్‌లో జరిగిన పేలుడులో ఆరుగురు మహిళలు సహా తొమ్మిది మంది మరణించారని ఫడ్నవీస్ తెలిపారు. సాయుధ బలగాల కోసం డ్రోన్లు, పేలుడు పదార్థాలను తయారు చేసే కంపెనీ ఇది. ఈ బాధాకరమైన సందర్భంగా బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

'నేను నాగ్‌పూర్ కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్‌ను సంప్రదిస్తూనే ఉన్నాను. ఐజీ, ఎస్పీ, కలెక్టర్ సంఘటనా స్థలంలో ఉన్నారు' అని ఫడ్నవిస్ తెలిపారు. సోలార్ ఇండస్ట్రీస్ సీనియర్ జనరల్ మేనేజర్ ఆశిష్ శ్రీవాస్తవ్ విలేకరులతో మాట్లాడుతూ బొగ్గు గనుల్లో ఉపయోగించే బూస్టర్లను ఉత్పత్తి చేసే భవనంలో ఈ ఘటన జరిగిందని చెప్పారు. ఉత్పత్తికి సంబంధించిన సీలింగ్ పనులు జరుగుతుండగా ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. ప్రాథమికంగా, తొమ్మిది మంది మరణించారు. గాయపడిన కార్మికులను ఆసుపత్రికి తరలించామని, కార్మికులందరినీ భవనం నుంచి ఖాళీ చేయించినట్లు వివరించారు. నిర్వహణ సిబ్బందితో పాటు పోలీసులు, పరిపాలన సిబ్బంది సంఘటనా స్థలంలో ఉన్నారని అధికారి తెలిపారు. ఆ వర్గాల సమాచారం ప్రకారం, బొగ్గు మైనింగ్ బ్లాస్ట్‌లో ఉపయోగించే పేలుడు పదార్థాలు ఈ కర్మాగారంలో తయారవుతున్నాయి. మరణించిన తొమ్మిది మందిని యువరాజ్ చరాదే, ఒమేశ్వర్ మచ్చిర్కే, మితా ఉకే, ఆర్తి సహారే, శ్వేతాలి మార్వాటే, పుష్పా మనాపురే, భాగ్యశ్రీ లోనారే, రుమితా ఉకే, మోసం పాట్లేగా గుర్తించినట్లు పోలీసు అధికారి చెప్పారు. గాయపడిన ఇతర కార్మికులను ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అధికారులు నష్టాన్ని అంచనా వేస్తున్నారని, పేలుడుకు గల కారణాలపై క్షుణ్ణంగా విచారణ జరుపుతున్నారని, పరిసర ప్రాంతాల భద్రతకు భరోసా ఇస్తున్నారని పోలీసు సూపరింటెండెంట్ హర్ష్ పొద్దార్ చెప్పారు.

అమరావతి ఉద్యమానికి నాలుగేళ్లు

(మొదటిపేజీ తరువాయి)

చేపడుతున్నారు. పాదయాత్రల ద్వారా ఉద్యమాన్ని ఉధృతం చేశారు. న్యాయస్థానాల ద్వారా తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. వారికి వైసీపీ మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతిస్తున్నాయి. అమరావతి పరిరక్షణ ఉద్యమానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం తుళ్లూరుతో పాటు వివిధ గ్రామాల్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఉద్యమ అమర వీరులకు రైతులు నివాళు అర్పించారు. ఏకైక రాజధానిగా అమరావతినే ఉంచాలని ప్లకార్డులతో రైతులు, మహిళలు నినదించారు. ఈ కార్యక్రమానికి అమరావతి రాజధాని పరిరక్షణ ఉద్యమ నాయకులతో పాటు ఇతర నేతలు హాజరై, జగన్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. నాడు రాజధానికి 33 వేల ఎకరాల భూములిచ్చి మోసపోయామని, తమ బాధలను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. 1,461 రోజులుగా అలుపెరగని ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. నాలుగేళ్లుగా రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల్లో దీక్షా శిబిరాలను ఏర్పాటు చేసి రైతులు నిరసనలు కొనసాగిస్తున్నారు. జగన్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా, కేసులు నమోదు చేసినా వాటిని ఎదుర్కొని రైతులు దీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యమంలో అత్యధికంగా మహిళలే కీలకపాత్ర పోషించారు. మూడు రాజధానుల బిల్లు, సీఆర్డీఏ చట్టం రద్దు బిల్లులు చెల్లబోవని హైకోర్టు గతంలో తీర్పునిచ్చింది. ఈ తీర్పునకు ముందే జగన్ ప్రభుత్వం బిల్లులను ఉపసంహరించుకున్న విషయం విదితమే. హైకోర్టు తీర్పును సుప్రీంలో రాష్ట్ర ప్రభుత్వం సవాలు చేసింది. అమరావతి రాజధాని, ఆర్5 అంశాలు సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నాయి. ఈ ఉద్యమంలో భాగంగా అమరావతే ఏకైక రాజధానిగా ఉండాలని రైతులు నినదించారు. క్యాంపు కార్యాలయం ముసుగులో విశాఖకు కార్యాలయాలను తరలించడంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. విశాఖను రాజధానిగా మార్చడాన్ని అన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. నాడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అమరావతికే తమ మద్దతు అని జగన్ చెప్పి, అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు రాజధానుల చట్టం తెచ్చి తమను మోసగించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 200 మంది రైతులు ప్రాణాలు కోల్పోయేలా ఈ ప్రభుత్వం వ్యవహరించిందని మండిపడ్డారు.

ఉద్యమం అణచివేతకు కుట్ర

అమరావతి రాజధాని పరిరక్షణ ఉద్యమాన్ని అణచివేసేందుకు పోలీసులతో ప్రభుత్వం అనేక కుట్రలకు పాల్పడిరదని రైతులు మండిపడుతున్నారు. తుళ్లూరు దీక్షా శిబిరం దగ్గర అమరావతి రాజధాని పరిరక్షణ ఉద్యమ నాయకులతో పాటు రైతులు, ఉద్యమ నేతలు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తమపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులకు పాల్పడినప్పటికీ, ఉద్యమాన్ని యధాతథంగా కొనసాగిస్తున్నామని నొక్కి చెప్పారు. న్యాయం కోసం పోరాడిన రైతులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు అన్యాయంగా పెట్టి, భయభ్రాంతులకు గురిచేసినా తాము వెనక్కి తగ్గలేదన్నారు. ఈ ప్రభుత్వం దిగిపోయి, వచ్చే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏకైక రాజధానిగానే అమరావతిని కొనసాగిస్తామని ప్రకటన చేసేంత వరకు అమరావతి ఉద్యమాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. హైకోర్టు తీర్పును జగన్ ప్రభుత్వం గౌరవించడం లేదని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తోందని, రైతులకు ఇచ్చిన ప్లాట్లను, అమరావతి రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం లేదన్నారు. అమరావతిని విచ్ఛిన్నం చేయాలని, విధ్వంసం చేయాలనే ఆలోచనతో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక రాజధానినే కట్టలేని జగన్, మూడు రాజధానులను ఎలా నిర్మిస్తారంటూ నిలదీశారు. తమకు న్యాయస్థానాల్లో అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే విశాఖకు క్యాంపు కార్యాలయాల తరలింపు నాటకానికి జగన్ తెరదీశారన్నారు. సీఎం జగన్‌కు దమ్ముంటే విశాఖకు వెళ్లాలని సవాలు విసిరారు. విశాఖలోని రిషికొండపై రూ.450 కోట్లతో అక్రమ భవనాలు నిర్మించారని విమర్శించారు.

రాజధానిలేని రాష్ట్రంగా ఏపీ : చంద్రబాబు

మూడు రాజధానులంటూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాలను తాము సరిదిద్దుతామని టీడీపీ అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్వీట్ చేస్తూ, అసూయతో జగన్ తీసుకున్న నిర్ణయాల వల్ల భూములు ఇచ్చిన వేలాది మంది రైతులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీకి రాజధాని లేని రాష్ట్రంగా జగన్ మార్చారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే జగన్ చేసిన తప్పులను సరిచేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రైతుల త్యాగం వృధా కాదని భరోసా ఇచ్చారు.

వెయ్యి కోట్ల టీడీఆర్‌కు కుట్ర!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ ఆస్తులుగా చూపించి టీడీఆర్‌కు అర్హత సంపాదించడమే. ప్రస్తుత 40 అడుగుల రోడ్డును మార్చడానికి జీవీఎంసీ ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యంతరాలు తెలియజేయడానికి చివరి తేదీ డిసెంబరు 19గా నిర్ణయించారు. 100 అడుగుల రోడ్డు వస్తే, సర్క్యూట్ హౌస్ జీవీఎంసీ వాటర్ ట్యాంక్‌లను ప్రైవేటు ఆస్తులుగా గుర్తిస్తే టీడీఆర్‌ల రూపంలో విజయసాయి, సుబ్బారెడ్డి బృందానికి రెండు వేల కోట్ల రూపాయల వరకు లబ్ధి చేకూరుతుందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి ఆ రెండు వేల కోట్ల రూపాయలతో ఎస్యూర్ ఎస్టేట్స్ భవనాలను నిర్మించుకోవచ్చని, ప్రభుత్వ భూమిని కొట్టేసి ప్రభుత్వ డబ్బుతోనే భవనాల నిర్మించి వేల కోట్ల వ్యాపారం చేయాలన్నది విజయసాయి, సుబ్బారెడ్డి బృందం కుట్ర అని విపక్ష పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. దానికి ధనుంజయ రెడ్డి శ్రీలక్ష్మి, సాయికాంత్ వర్మ భజన బృందంగా మారి వంతపాడుతున్నారని, విశాఖ ప్రజలు ఇప్పటికైనా విజయ సాయి, సుబ్బారెడ్డి కుట్రలను గమనించి, వారి కబ్జా కబంధ హస్తాల నుంచి విశాఖను కాపాడాలని విపక్షాలన్నీ పిలుపునిచ్చాయి. సర్క్యూట్ హౌస్ కొండపై ట్రాఫిక్ కూడా పెద్దగా లేనందువల్ల రహదారి విస్తరణ అవసరం లేదంటూ జీవీఎంసీకి దరఖాస్తులు ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉందని తెలిసి, వైసీపీ ప్రభుత్వం తిరిగి వచ్చే అవకాశం లేదని గుర్తించి విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి బృందం వేల కోట్ల రూపాయలు దోచుకునేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాలను తిప్పి కొట్టాల్సిందిగా కోరుతున్నట్లు మీడియా సమావేశాల్లో తెలిపారు. దస్పల్లా రోడ్డు 100 అడుగుల విస్తరణ నోటిఫికేషన్ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా జరిగింది. మాస్టర్ ప్లాన్‌ను ఆర్డీపీకి విరుద్ధంగా రూపొందించారు. దస్పల్లా కుంభకోణానికి సూత్రధారి యూఎల్‌సి సుబ్బరాజు ఇంటిని మినహాయించి రహదారి విస్తరణకు ప్రతిపాదించారు. అందుకోసం మాస్టర్ ప్లాన్ రూపొందించిన చెన్నైకి చెందిన లీ అసోసియేట్‌ను మేనేజ్ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. రహదారి విస్తరణ చేయాలంటే ఉన్న రహదారి మధ్య నుంచి అటు ఇటు విస్తరణ జరగాలి. అందుకు విరుద్ధంగా సుబ్బరాజు నివాసాన్ని మినహాయించడం అనుమానాలకు అవకాశం కల్పిస్తోంది. విజయ సాయి ప్రతిపాదించిన వెంచర్‌కు అడ్డు వచ్చాయంటూ ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న జీవీఎంసీ వాటర్ ట్యాంకులను అక్కడి నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారు. సొంత ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయటం, బదిలీ చేయటం సమర్థనీయం కాదు. సొంత ప్రయోజనాలు తప్ప, విశాఖ వాసుల ప్రయోజనాల పట్టని విజయసాయి రెడ్డి, సుబ్బారెడ్డి కారణంగా దూడూ బసవన్నలుగా మారిన అధికారులు ఈ పనులు చేస్తున్నారు. దస్పల్లా హిల్స్‌లో ప్రస్తుతం ఉంటున్న వారిని భయపెట్టేందుకు నీటి సరఫరాను కూడా మధ్య మధ్యలో నిలిపివేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు నెలలు మాత్రమే గడువు ఉన్నందున ఎన్నికల నిబంధనావళి అమలులోకి వస్తుంది. దీని ప్రకారం వందల వేల కోట్ల రూపాయలను నిర్ణయాలను అధికారులు తీసుకోకూడదు. విశాఖలోని ఐఏఎస్ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వీరి వ్యవహారాలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. విజయసాయి బినామీ అయిన ఎస్యూర్ ఎస్టేట్స్‌కు మాతృ సంస్థ అయిన అరబిందో నుంచి ఈ పనుల కోసం నిధులు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. అరబిందోకు చెందిన శరత్ చంద్రరెడ్డి ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇప్పటికే అరెస్టయి బెయిల్ మీద ఉన్నారని, అదే సంస్థ విశాఖలో పెడుతున్న పెట్టుబడులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు లోతుగా విచారణ జరిపితే మరోమారు వీరంతా అరెస్టు అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు.

రోడ్ల విస్తరణతో టీడీఆర్‌ల స్కాం : జనసేన నేతలు

వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జ్‌గా వచ్చిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నగరం నడిబొడ్డులోని రూ.3 వేల కోట్ల విలువైన దసపల్లా హిల్స్ భూములను నిబంధనకు విరుద్ధంగా కొట్టేశారని, దానిని ఆపుతానంటూ తెరపైకి వచ్చిన తాజా ఇన్‌ఛార్జ్ వైవీ సుబ్బారెడ్డి చివరకు ఆయనతో కుమ్మక్కై రూ.2 వేల కోట్ల టీడీఆర్ స్కామ్‌కు తెరలేపారని జనసేన నేతలు బొలిశెట్టి సత్యనారాయణ, పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ఆదివారం విశాఖలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలు ఎవరు అడగకుండానే దస్పల్లా హిల్స్‌లో ప్రస్తుతం ఉన్న 40 అడుగుల రోడ్డును 100 అడుగుల రోడ్డుగా విస్తరించి అందుకోసం వెయ్యి కోట్ల రూపాయల పరిహారం టీడీఆర్ రూపంలో ఇవ్వటానికి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ అధికారులు సిద్ధమయ్యారని తెలిపారు.

అభివృద్ధి కంటే కుంభకోణాలకే ప్రాధాన్యాలు ఇచ్చే సీఎం పేషీ ప్రత్యేక అధికారి ధనుంజయ రెడ్డి, అవినీతి ఆరోపణలతో జైలుకెళ్లి వచ్చిన మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఈ కుంభకోణం కోసం విశాఖ అధికారులతో పదేపదే సమీక్షలు జరుపుతున్నారన్నారు. వారు చెప్పిందే తడవుగా నిబంధనలకు విరుద్ధంగా యువ ఐఏఎస్ అధికారి అయిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. ప్రజలు రోజూ రవాణా కష్టాలతో ఇబ్బందులు పడుతున్న ప్రధాన రహదారుల విస్తరణకు కనీస ప్రయత్నం కూడా చేయని జీవీఎంసీ... విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి ఒత్తిడితో ధనుంజయ రెడ్డి, శ్రీలక్ష్మీల ప్రోద్బలంతో అసలు రద్దీ లేని దస్పల్లా హిల్స్ రోడ్ విస్తరణకు నోటిఫికేషన్ జారీ చేశారని మండిపడ్డారు. జీవీఎంసీతో ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసిన ఆ రహదారి నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించారని తెలిపారు.

తుగ్లక్ నిర్ణయానికి నాలుగేళ్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ రాజధాని అమరావతి పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న తుగ్లక్ నిర్ణయానికి నేటికి నాలుగేళ్లు నిండిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సరిగ్గా నాలుగేళ్ల క్రితం అమరావతి రాజధానిని నిర్వీర్యం చేయాలనే తలంపుతో సీఎం జగన్ దుష్ట నిర్ణయానికి శ్రీకారం చుట్టారన్నారు. మూడు రాజధానులు అంటూ మోసపూరిత ప్రకటనతో మూడుముక్కలాటకు సిద్ధమయ్యారని, దాదాపు రూ.10 వేల కోట్లతో అమరావతి ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని నిర్వీర్యం చేశారన్నారు. జగన్ తుగ్లక్ నిర్ణయంతో ఆందోళన చెందిన రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా అమరావతి రాజధాని ప్రాంత రైతులు, మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టారని వివరించారు. అమరావతి రాజధాని ఉద్యమంపై జగన్ సర్కార్ కక్ష కట్టి అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, బెదిరింపులు, జైళ్లకు పంపటం వంటి కుయుక్తులు పన్నినప్పటికీ, అమరావతి రైతులు, మహిళలు అదరలేదు, బెదరలేదన్నారు. అమరావతి రాజధాని ఉద్యమం నాలుగేళ్ల పాటు సుదీర్ఘంగా సాగి చారిత్రక ఉద్యమంగా పేరుగాంచిందని, అమరావతి ఉద్యమకారులకు సీపీఐ తరపున జేజేలు తెలిపారు. అమరావతినే ఏపీ రాజధానిగా కొనసాగిస్తూ అభివృద్ధి చేయాలని రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చినప్పటికీ, సీఎం జగన్ పెడచెవిన పెట్టి సుప్రీం కోర్టుకెక్కారని గుర్తు చేశారు. కేసు సుప్రీం కోర్టు పరిధిలో ఉండగానే జగన్ తన ఇష్టానుసారం రాజధాని విశాఖకు తరలిస్తామని పదేపదే ప్రకటనలు చేస్తూ కోర్టులను ధిక్కరిస్తున్నారన్నారు. ఇటీవల పార్లమెంటు సాక్షిగా అమరావతే ఏపీ రాజధానిగా కేంద్రం స్పష్టం చేసిందని, అమరావతి మాస్టర్ ప్లాన్ ఆమోదించినట్లు వెల్లడించిందన్నారు. రాష్ట్ర ప్రజలు ముక్తకంఠంతో అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలని కోరుతున్నా జగన్ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించటం దుర్మార్గమని పేర్కొన్నారు. కోర్టులు, కేంద్రం అమరావతినే రాజధానిగా గుర్తించినా జగన్ తన నిరంకుశత్వాన్ని విడనాడలేదన్నారు. జగన్ నియంతృత్వ ధోరణిని తీవ్రంగా ఖండించారు. హైకోర్టు తీర్పును, కేంద్ర నిర్ణయాన్ని, నాలుగేళ్ల చారిత్రక అమరావతి రాజధాని ఉద్యమాలను ఇప్పటికైనా సీఎం జగన్ గౌరవించి, అమరావతినే రాజధానిగా కొనసాగిస్తూ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

చేరుకుందన్నారు. ఈ ఉద్యమ కాలంలో అమరావతి పరిరక్షణ కోసం 247 మంది అశువులు బాసారని, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఉద్యమ కాలంలోనే సుమారుగా 2,700 మందిపై 285 అక్రమ పోలీసు కేసులు నమోదు చేశారని, ఎలాంటి ఆదాయ మార్గాలు లేని రైతులకు కౌలు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. అమరావతి సామాజిక పింఛన్‌ను రూ.5 వేలకు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. పింఛన్లు పొందేవారు రాజధాని గ్రామాల్లో 15 వేల మంది ఉంటారని, వారిలో వృద్ధులు 5 వేల మందిని మినహాయించినా మిగిలిన 10 వేల మంది ఎందుకు పోరాటానికి ముందుకు రావడం లేదన్నారు. పోరాడకపోతే సమస్య పరిష్కారం కాదన్నారు. ప్రతిపక్షంలో ఉండి చంద్రబాబు కన్నా అమరావతిని ఎక్కువ అభివృద్ధి చేస్తానని నమ్మబలికిన జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మడమ తిప్పారని అన్నారు. టీడీపీ హయాంలో ఎంతో కొంత అభివృద్ధి జరిగిందే తప్ప వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. వచ్చే ఎన్నికలలో వైసీపీ సింగిల్ డిజిట్‌కి పరిమితం కావాలని అన్నారు. అమరావతి బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయకుండా రాజధానిలో ఇసుక, కంకర, ఇనుము దొంగిలించినట్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో తాళాలు పగులగొట్టి గుడ్లు ఎత్తుకుపోతున్నారని ఎద్దేవా చేశారు. అమరావతి ప్రాంతం నుంచి పోటీచేసే ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులకు లక్ష ఓట్ల మెజార్టీ రావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చిలకా విజయ్ కుమార్ మాట్లాడుతూ త్వరలో అమరావతికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వస్తారని, అమరావతికి కాంగ్రెస్ అండగా ఉంటుందని చెప్పారు. దళిత బహుజన జేఏసీ కన్వీనర్ చిలకా బసవయ్య మాట్లాడుతూ అసైన్డ్ రైతులకు మూడేళ్లుగా కౌలు చెల్లించడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ధనేకుల రామారావు, బెల్లంకొండ నరసింహారావు, పువ్వాడ సుధాకర రావు, రాయపాటి శైలజ, న్యాయవాది రజని, కాటా అప్పారావు తదితరులు పాల్గొన్నారు. తొలుత అమరావతి జెండాను ఆవిష్కరించారు. అమరావతి ఉద్యమంలో అశువులు బాసిన వారికి నివాళులర్పించారు.

దున్నపోతుకు వినతిపత్రం అందజేత

అమరావతి ఉద్యమం మొదలుపెట్టి ఆదివారానికి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రైతులు, మహిళలు వినూత్నంగా దున్నపోతుకు జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటాన్ని అతికించి వినతిపత్రం అందజేశారు.

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం



(మొదటిపేజీ తరువాయి)

అంగన్‌వాడీల సమ్మెలో పాల్గొన్న జేఏసీ నాయకులు జే.లలితమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై పట్ల ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయాల ముందు నిరసన తెలపనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీలు తక్షణం సమ్మె విరమించి విధులకు హాజరుకాకపోతే 10వ తరగతిలో ఉత్తీర్ణులను అంగన్‌వాడీ టీచర్లుగా నోటిఫికేషను విడుదల చేస్తామని జగన్ ప్రభుత్వం బెదిరించడం సిగ్గుచేటన్నారు. జగనన్న ఏ హామీలు అయితే ఇచ్చారో ఆ హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని ,ఈ రకమైన పద్ధతే కొనసాగితే రాబోవు కాలంలో ఇంటికి పంపడం ఖాయమని లలితమ్మ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, ఏఐటీయూసీ కర్నూలు నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, సీఐటీయూ నగర అధ్యక్షులు నరసింహులు, కామేశ్వరి, బాలదుర్గమ్మ, నాగమణి,మహేశ్వరి, చౌడేశ్వరి, సునంద, రాధిక పాల్గొన్నారు.

కేరళ అనిశ్చితికి గవర్నర్ యత్నం

(మొదటిపేజీ తరువాయి)

పతానమిట్టలో పర్యటించిన విజయన్ అక్కడ విలేకరులతో మాట్లాడారు. 'కేరళలోని ప్రశాంత వాతావరణాన్ని నాశనం చేసేందుకు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యలను గవర్నర్ తీసుకుంటున్నారని గతంలోనూ చెప్పా. ఆయన చర్యలు నా మాటలను నిజం చేశాయి. పదేపదే తన స్థాయిని మరిచిపోయి వ్యవహరిస్తారు. పదవి హూందాతనాన్ని దిగజార్చే వ్యాఖ్యలు చేస్తారు' అని సీఎం వ్యాఖ్యానించారు. ఛాన్సలర్‌గా గవర్నర్ తీసుకున్న చర్యలు ఆందోళనలకు దారితీసినట్లు తెలిపారు. 'విశ్వవిద్యాలయం సిఫార్సు చేసే వారిలో నుంచి యూనివర్సిటీ సెనేట్‌కు వ్యక్తులను ఛాన్సలర్ నామినేట్ చేయాల్సింది ఉంటుంది కానీ ఈయన మాత్రం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వారిని ఎంపిక చేశారు. అంతేకాకుండా నామినేషన్ల కోసం విశేషాధికారాలను వినియోగించినట్లు చెప్పుకున్నారు. యూనివర్సిటీ సిఫార్సు చేసే పేర్ల నుంచి ఎంపిక చేసేందుకు మాత్రమే ఆ అధికారులను వినియోగించాలి. ఈయన సొంతంగా వ్యక్తులను గుర్తించి, నామినేట్ చేయవచ్చా? యూనివర్సిటీ ప్యానల్ అర్హులు, సమర్థులు సిఫార్సు చేసినప్పటికీ ఆర్ఎస్ఎస్ వారిని నామినేట్ చేయడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు' అని విజయన్ అన్నారు. నిరసనకారులను నేరస్తులు, గూండాలని కఠిన పదజాలంతో దూషించారని, తన హోదాను మరిచి వ్యవహరించారని గవర్నర్‌ను దుయ్యబట్టారు. నల్ల జెండాలు చూపిన నిరసనకారులతో సమాన హోదాలో ఉన్న ఈయనలా మరెవ్వరైనా ప్రవర్తించారా? అని విజయన్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. 'మాకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసనలు జరిగితే మేము వ్యక్తిగతంగా జోక్యం చేసుకోబోం, అలాంటి పరిస్థితుల్లో చర్యలను పోలీసులకు వదిలేస్తాం' అని సీఎం చెప్పారు. ఇటీవల కేరళ గవర్నర్ తీరుపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రోహింగ్టన్ నారిమన్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ యావత్ దేశం ఈయన చర్యలను గమనిస్తోందన్నారు. బిల్లులను పెండింగ్‌లో ఉంచి సుప్రీంకోర్టు చీవాట్లు పెడితే ఒక బిల్లును ఆమోదించి, మిగతావి రాష్ట్రపతి పరిశీలనకు పంపిన కేరళ గవర్నర్ తీరును జస్టిస్ నారిమన్ తీవ్రంగా విమర్శించిన విషయం విదితమే.

అంగన్‌వాడీల కోసం మరిన్ని పోరాటాలు : ముప్పాళ్ల

(మొదటిపేజీ తరువాయి)

చేస్తుంటే ప్రభుత్వం చోద్యంచూస్తున్నదన్నారు. అంగన్‌వాడీలపై నిర్బంధం తగదన్నారు. సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్లు 36 గంటలు దీక్షలు చేస్తుంటే వారిని సైతం పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఏఐటీయూసీ, సీఐటీయూ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఐకమత్యమే బలమన్నారు. రానున్న రోజులలో అన్ని సంఘాల ఐక్యతతో మరిన్ని పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పచ్చల శివాజీ, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు పాల్గొన్నారు.

మౌనం వీడిన మోదీ

(మొదటిపేజీ తరువాయి)

ఆరా తీయాలని ప్రధాని అన్నారు. 'సభలో జరిగినది ఆందోళనకరం. ఇది తేలిగ్గా తీసుకునే అంశం కాదు కాబట్టి సమ్మిళిత స్ఫూర్తితో దీనికి పరిష్కారాన్ని కనుగొనే ప్రయాస జరగాలి. అనవసరంగా రాద్ధాంతం చేయడాన్ని ప్రతి ఒక్కరు మానుకోవాలి' అని మోదీ చెప్పారు. పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై స్పీకర్ కూడా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అదే సమయంలో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా కొత్త వారిని తెరపైకి తేవడంపై ప్రశ్నకు స్పందిస్తూ వారంతా అనుభవం ఉన్న నాయకులని మోదీ అన్నారు. బీజేపీ ఎంపికలను హేళన చేసే వారిది సంకుచిత బుద్ధి అని విమర్శించారు. మీడియా కొందరిపైనే దృష్టి పెడుతుంది కాబట్టి మిగతా వారు కొత్తగా అనిపిస్తారరు కానీ వారేమీ కొత్త వారు కాదు, అనుభవజ్ఞులు, సమర్థులన్నారు. అధికరణ 370పై సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తూ సర్వోన్నత న్యాయస్థానం సమర్థన లభించింది. ఇక విశ్వంలో ఏ శక్తి దానిని పునరుద్ధరించలేదని ఉద్ఘాటించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో చారిత్రక విజయాన్ని సాధిస్తామని దీమా వ్యక్తంచేసిన మోదీ ప్రతిపక్షాలకు ఆత్మవిమర్శ అవసరమన్నారు.

చర్చకు ముఖం చాటేస్తున్న మోదీ: కాంగ్రెస్

పార్లమెంటు ఘటనపై చర్చ నుంచి ప్రధాని మోదీ తప్పించుకుంటున్నారని, బీజేపీ ఎంపీ పాత్ర గురించి ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ముఖం చాటేస్తున్నారని కాంగ్రెస్ విమర్శించింది. లోక్‌సభలో అలజడి సృష్టించిన వారికి పాసులు ఇచ్చినది మైసూరుకు చెందిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా విషయంలో ప్రశ్నలకు ప్రభుత్వం స్పందించడం లేదని దుయ్యబట్టింది. పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై ప్రధాని ఎట్టకేలకు నోరు విప్పారని ఎద్దేవా చేసింది. విపక్షాలు అనవరంగా రాద్ధాంతం చేస్తున్నారన్న వ్యాఖ్యలను ఖండించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'డిసెంబర్ 13న లోక్‌సభలో జరిగిన అసాధారణ ఘటనపై ప్రధాని మోదీ ఎట్టకేలకు మౌనం వీడారు. ఈ ఘటనపై విచారణ అవసరమని, చర్చ అక్కర్లేదని ఆయన చెప్పారు. ఇది ఎంత వరకు సమంజసం' అని అన్నారు. పార్లమెంటులో జరిగిన దానిపై సభాముఖంగా ప్రకటనను హోంమంత్రి చేయాలని ఇండియా పార్టీలు డిమాండ్ చేస్తున్నాయని, అది జరిగేంత వరకు వెనక్కి తగ్గబోవని తెలిపారు. చాలా సాధారణమైన కారణం కోసం చర్చ నుంచి ముఖం చాటేస్తున్నారని ప్రధాని మోదీ తీరును జైరాం రమేశ్ దుయ్యబట్టారు.

ఉపాధి హామీ సక్రమ అమలుకు పోరు

సీహెచ్ కోటేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఒక్కొక్క కూలీకి సంవత్సరానికి 210 పనిదినాలు కల్పించి, రోజుకు 600 రూపాయలు కూలి చెల్లించినప్పుడే ఈ పథకం లక్ష్యం నెరవేరుతుందనీ, ఈ లక్ష్యసాధన కోసం గ్రామీణ కష్టజీవులంతా సమైక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. వలసలు కరువు నివారణకు ఉపాధి హామీ పనులు తక్షణం ప్రతి గ్రామంలోనూ ప్రారంభించి కష్టజీవులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఈ నెల 20వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా జయప్రదానికి మైలవరం నియోజకవర్గం చెవుటూరు గ్రామంలో ఆదివారం ప్రచార కార్యక్రమాన్ని కోటేశ్వరరావు ప్రారంభించారు. చేసుకోవడానికి ఏదైనా పని కల్పించండి లేదా భృతి అయినా ఇవ్వండి అని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దశాబ్దాలు తరబడి పేదలు నిర్వహించిన పోరాటాల ఫలితంగా 2005 లో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ పథకం కింద ఇస్తున్న కూలి పేదలు కనీస జీవనం గడిపేందుకు చాలడం లేదన్నారు. జాబ్ కార్డుల్లో ఉన్న వారందరికీ కలిపి వంద రోజులు పని మాత్రమే చూపిస్తున్నారని రాజ్యాంగం నిర్దేశించిన పరిధిలో పేదలకు కనీస న్యాయం జరగడంలేదని కోటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం సక్రమ అమలు కోసం ఈ నెల 20వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే ధర్నాలో గ్రామీణ పేదలు, ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బుడ్డి రమేశ్ పేదలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గూడూరు శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చింతయ్య, గాదే ఫిలిప్, ఏసమ్మ, ఆదిమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు నిలువెత్తు రూపం చంద్ర రాజకుమారి

వర్ధంతి సభలో వక్తల నివాళి

విశాలాంధ్ర - చల్లపల్లి: పోరాటాలకు నిలువెత్తు రూపం చంద్ర రాజ కుమారి అని ప్రముఖ వైద్యులు డాక్టర్ దేవ సుజాత, సామాజిక కార్యకర్త నార్ల మాలతి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జాతీయ నాయకులు చంద్ర రాజకుమారి ఐదవ వర్ధంతి కృష్ణాజిల్లా చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సుజాత, మాలతీ మాట్లాడుతూ మహిళలకు సమాజంలో సముచిత స్థానం కల్పించాలని, ఉన్నతమైన వ్యక్తులుగా జీవించాలని రాజకుమారి పరితపించే వారన్నారు అన్నారు. స్త్రీల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. స్త్రీలపై జరిగే అఘాయిత్యాలపై మహిళలను చైతన్యం చేస్తూ వారికి అండగా ఉండేవారని చెప్పారు. పోరాట పటిమ ఉన్న మహోన్నత వ్యక్తిగా కొనియాడారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే కుటుంబాలు పరిపుష్టిగా ఉంటాయని నమ్మిన రాజకుమారి మహిళలకు, బాలికలకు కుట్టు, మగ్గం పనులలో శిక్షణ ఇప్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేశారని కొనియాడారు. చిన్న చిన్న సమస్యలకు ఒత్తిడికి లోనై ప్రాణాల మీదకు తెచ్చుకునే విధంగా ఉండకుండా పిల్లల్లో మనోధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పై ఉందన్నారు. ఆడపిల్లల్లో మనోధైర్యాన్ని నింపేందుకు చంద్ర రాజకుమారి పరితపించేవారని ఆ దిశగా మనం ముందుకు నడవడమే రాజకుమారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కృష్ణాజిల్లా గౌరవా ధ్యక్షులు పిడికిటి సంధ్యాకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, అవనిగడ్డ నియోజక వర్గ కార్యదర్శి కంచర్ల ప్రభ కుమారి, డాక్టర్ సదానందం చంద్ర రాజకుమారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రమ్మ, సలోమి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల సురేంద్ర బెనర్జీ, పార్టీ నాయకులు సక్కా శ్రీనివాసరావు, సిద్దాబత్తుల వాసు, ఆర్ఎంపి శేషు తదితరులు పాల్గొన్నారు. తొలుత రాజకుమారి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య సీనియర్ నాయకులు పరుచూరి భారతి, బేబీని సత్కరించారు.

అలరించిన వినోద వల్లరి

విశాలాంధ్ర-విశాఖ : విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం క్రియేటివ్ కామెడీ క్లబ్ నిర్వహించిన వినోద వల్లరి అలరించింది. పుస్తక మహోత్సవ ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. హాస్యరత్న వేముల భాస్కరాచారి, కుమారి మల్లిక, తాళాభక్తులు లక్ష్మీప్రసాద్, సరగడ చిన్నరెడ్డి, శ్రీమతి పద్మ చేసిన కామెడీ స్కిట్స్, జోక్స్, పేరడీ సాంగ్స్, జానపద గీతాలు అలరించాయి. సభ ప్రారంభానికి ముందు అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజును క్రియేటివ్ కామెడీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షులు మేడా మస్తాన్ రెడ్డి సారధ్యంలో జరిగిన కార్యక్రమంలో కె.వి.ఎస్.మూర్తి, వెలమల సిమ్మన్న, పరమేశ్వరరావు, పి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టాభికి కాంగ్రెస్ నేతల నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్ పార్టీ మాజీ నేత పట్టాభి సీతారామయ్య వర్ధంతిని ఆదివారం విజయవాడ లోని ఆంధ్ర రత్న భవన్ లో నిర్వహించారు. తొలుత పట్టాభి చిత్రపటానికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరామ్, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ బలోపేతానికి సీతారామయ్య చేసిన సేవలను వారు గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర, నగర కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

సీపీఐ కార్యకర్తలకు ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రతి కార్యకర్త నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపుని చ్చారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఆదివారం సీపీఐ ఒంగోలు డివిజన్ పరిధిలోని శాఖ కార్యదర్శుల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఈశ్వరయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న రాజకీయ సమీక రణాలను ఎప్పటి కప్పుడు క్షుణ్ణంగా గమనిస్తూ, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమంలో కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని తెలిపారు. ప్రభుత్వ ప్రతి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరి దరి చేర్చేందుకు కార్యకర్తలు ముందుండాలన్నారు. పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. దేశంలో బీజేపీ చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి సీపీఐ చేసిన కృషిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త పైన ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, సంతనూతలపాడు నియోజకవర్గ కార్యదర్శి నల్లూరి మురళి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రామకృష్ణ, ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గ పరిధిలోని శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెన్నుపోటు చంద్రబాబు డీఎన్ఏ

వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండా రాజీవ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వెన్నుపోటు, దగా, కుట్రలు చంద్రబాబు డీఎన్ఏ అని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండా రాజీవ్ విమర్శించారు. సీఎం జగన్ క్రియేటర్ అయితే, చంద్రబాబు డెకరేటర్ అని అన్నారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేశ్‌ది పాదయాత్రా ?, లేక డైటింగ్ యాత్రా? అని ప్రశ్నించారు. లోకేశ్ నీ స్థాయిని మించి మాట్లాడుతున్నావ్, జాగ్రత్త అని హెచ్చరించారు. చంద్రబాబు కొడుకు కాకపోతే నీ స్థాయి ఏంటో గుర్తు చేసుకోవాలని సూచించారు. ఎర్ర బుక్కులో రామకోటి రాసినా పుణ్యమన్నా వస్తుందన్నారు. మరో పదేళ్లకు పవన్ ప్యాకేజీ మాట్లాడుకున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రగిరి నుంచి కుప్పం ఎందుకు ట్రాన్స ఫర్ అయ్యావ్..బాబూ..? అని ప్రశ్నించారు.

రాజధాని రైతులకు అభినందనలు: వి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాజధాని అమరావతి పరిరక్షణ కోసం పోరాటం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రైతులకు, కూలీలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. వారి పోరాటానికి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. మూడు రాజధానుల పేరుతో జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి, రైతులను వీధుల పాలు చేసిందని విమర్శించారు. చేసిన తప్పును సరిదిద్దుకుని అమరావతినే రాజధానిగా ప్రకటించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వం రాజధాని విషయంలోనూ నాటకాలాడుతూ రైతుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు విధానాలకు, బీజేపీ విద్రోహానికి వ్యతిరేకంగా ప్రజలంతా అమరావతి పోరాటానికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

ఏ యస్ ఐ సుధాకర్ రెడ్డి

కానిస్టేబుల్ రాము

పోలీసులను టార్గెట్ చేస్తూ 21 చోట్ల పాతిపెట్టిన బాంబులను నిర్వీర్యం చేసిన బీజాపూర్ జిల్లా పోలీసులు

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల మెరుపుదాడి

ఏఎస్ఐ అక్కడికక్కడే మృతి కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - చింతూరు : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివారం మావోయిస్టులు సీఆర్‌పీఎఫ్ పోలీసులపై మెరుపు దాడి చేశారు. అందులో ఒక ఏఎస్ఐ మృతిచెందగా, మరో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే సుకుమా జిల్లాలోని జైగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బదిరే సిఆర్‌పీఎఫ్ (165) క్యాంప్ నుంచి సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాలింపు చర్యలకు ఆదివారం ఉదయం ఏడు గంటలకు బయలుదేరారు. సమీపంలో ఉన్న పుర్సంగల్ గ్రామ వారాంతపు సంతలో గస్తీ నిర్వహిస్తుండగా నలుగురు యువకులు చిన్న తుపాకీతో సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ సుధాకర్ రెడ్డిపై మెరుపు దాడి చేసి కాల్పులు జరిపారు. ఆయన అక్కడికక్కడే మృతి చెందగా వెంట వున్న రాము అనే కానిస్టేబుల్ మావోయిస్టులపై కాల్పులు జరపగా మావోయిస్టు కూడా రాముపై కాల్పులు జరిపారు. దీంతో రాముకి తీవ్రగాయాలు అయ్యాయి. అక్కడికి చేరుకున్న జవాన్లు కాల్పులు జరిపారు. అప్పటికే మావోయిస్టులు పరారయ్యారు. తీవ్ర గాయాలైన రామును ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హెలికాప్టర్‌లో రాయపూర్ మహారాణి ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనలో మృతి చెందిన ఏఎస్ఐ సుధాకర్‌రెడ్డికి ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సహాయ్ శ్రద్ధాంజలి ఘటించారు. ఘటన అనంతరం రాష్ట్రమంతా అలెర్ట్ చేసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ విషయంలో నలుగురు అనుమానితులను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు వరుస పేలుళ్లకు కుట్రపన్నగా పోలీసులు భగ్నం చేశారు. బీజాపూర్ జిల్లాలోని పలనార్-సవనార్ గ్రామాల మధ్య రోడ్డుపై పది మీటర్లకి ఒకటి చొప్పున ఇరవై ఒక్క ఐఈడీలను అమర్చగా పోలీసులు గుర్తించి నిర్వీర్యం చేశారు. ఈ విషయంపై గంగలూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.

ఉద్యోగాల భర్తీకి ఉధృత ఉద్యమం

విద్యార్థి, యువజన సంఘాల పిలుపు

విశాలాంధ్ర- గుంటూరు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యో గాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వాలనే డిమాండ్‌తో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు హెచ్చరించారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కట్టా జవహర్ బాబు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు మన్నవ వంశీకృష్ణ శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు రావిపాటి సాయి కృష్ణ, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు తిరుమలరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భంగా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతు న్నప్పటికీ ఉద్యోగాలు భర్తీ చేయడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అవుతుందని విమర్శించారు. ఆరు సంవత్సరాల నుంచి ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా రాలేదని టీటీసీ, బీఈడీ చేసిన నిరుద్యోగులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. ఇటీవల గ్రూప్-1, 2 భర్తీ కోసం జారీచేసిన నోటిఫికేషన్లు ఎన్నికల సందర్భంగా నిరుద్యోగ ఓట్ల కోసం కాకుండా ఉద్యోగాలు భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రూప్-1 మెయిన్ పరీక్ష కోసం నూతన సిలబస్‌లో కోచింగ్ తీసుకున్నారని, అయితే ఇప్పుడు ఏపీపీఎస్సీ పాత సిలబస్‌లో పరీక్షలు నిర్వహిస్తామని గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నదని, అలా కాకుండా నూతన సిలబస్‌లోనే పరీక్షలు నిర్వహించాలని కోరారు. నిరుద్యోగ వయోపరిమితి 42 సంవత్సరాల నుంచి 44కు పెంచాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై చర్చించి ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలనీ, లేనిపక్షంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరుద్యోగులను చైతన్యవంతం చేసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

18న జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు:

ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని, నిరుద్యోగ వయోపరిమితిని పెంచాలని, మెగా డీఎస్సీ విడుదల చేయాలని తదితర డిమాండ్లతో ఈ నెల 18వ తేదీన 26 జిల్లాల కలెక్టర్లకు నిరుద్యోగులతో కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామని నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా, నగర అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, చిన్నపోతుల శ్రీనివాసరావు, చల్లా మరియదాసు, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శశి, బన్నీ, సాయి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు ధర్మ తేజ తదితరులు పాల్గొన్నారు.

బందరు బీచ్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థి గల్లంతు

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నం తాళ్లపాలెం బీచ్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థి సముద్రంలో మునిగి మృత్యువాత పడ్డ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం, నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఉదయాన్నే మచిలీపట్నం చేరుకుని స్నానం చేయడానికి సముద్రంలోకి దిగారు. అయితే ఒక్కసారిగా అలల ఉధృతి పెరగడంతో సముద్రంలోకి దిగిన కొద్దిసేపటికి విద్యార్థులంతా కొట్టుకుయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మెరైన్ పోలీసులు గమనించి నలుగురు విద్యార్థులను కాపాడారు. అదే సమయంలో పెద్ద అలల కింద తోకల అఖిల్ అనే విద్యార్థి కొట్టుకుపోయాడు. మెరైన్ పోలీసులు తీవ్ర ప్రయత్నం చేసినా అతని జాడ కనిపించలేదు. ఎట్టకేలకు మధ్యాహ్నానికి అఖిల్ మృతదేహం సముద్ర ఒడ్డుకు కొట్టుకువచ్చింది.

మోదీ హటావో దేశ్‌కి బచావో ఉద్యమం

ఏఐకేఎస్ నాయకులు విజ్జు కృష్ణన్

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: మోదీ హటావో దేశ్‌కి బచావో ఉద్యమ నినాదంతో ఆందోళనలు చేపడతామని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ తెలిపారు. అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ సమితి సమావేశాల ముగింపు సందర్భంగా ఆదివారం కర్నూలులోని సత్య ఇన్ రెసిడెన్సిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జాతీయ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, కృష్ణ ప్రసాద్, తీగల సాగర్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న అనేక రకాల పరిణామాలపై 26 రాష్ట్రాల నుంచి హాజరయిన ప్రతినిధులు మూడు రోజుల సమావేశాల్లో చర్చించినట్లు తెలిపారు. దేశంలో రైతులతో పాటు కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారన్నారు. అయితే బీజేపీ తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తామని, రైతు రుణాలను మాఫీ చేస్తామని, యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామంటూ అనేక వాగ్దానాలు చేసిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక హామీలన్నీ వదిలి రైతులను దారుణంగా దగా చేసిందన్నారు. రైతుల అప్పులు పెరిగాయని, దేశంలో లక్ష మంది పైనే రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మరో మూడు లక్షల మంది కార్మికులు, కౌలు రైతులు, 50 వేల మంది చదువుకున్న యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను, కార్మికులకు వ్యతిరేకంగా కార్మిక కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. కేంద్రం ఇప్పుడు కొత్తగా స్మార్ట్ మీటర్లు తీసుకువస్తే, వాటిని పంట పొలాలకు బిగించేలా ఈ రాష్ట్రంలో అమలు జరిగిపోతోందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని, వాటికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. హన్నన్ మొల్లా మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల కారణంగా వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. రూ.50 కోట్లు కూడా రైతులకు ఇవ్వని మోదీ ప్రభుత్వం... అదాని, అంబానీలకు ఏజెంట్‌గా మారి వారికి 50 లక్షల కోట్ల రూపాయలను దోచిపెడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మోదీ హటావో దేశ్‌కి బచావో నినాదంతో గ్రామస్థాయి నుంచి దేశ స్థాయి వరకు వివిధ రూపాలలో ప్రచారాలు నిర్వహించాలని, పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా మరో ఆందోళనా కార్యక్రమం చేపట్టాలని తీర్మానించినట్లు తెలిపారు.

రేపటి నుంచి ప్రజానాట్యమండలి పాదయాత్రలు

జయప్రదానికి నేతల పిలుపు



విశాలాంధ్ర-గుంటూరు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, ప్రజా చైతన్యం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి రెండు రోజుల పాటు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర, అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రానాయక్, చిన్నం పెంచలయ్య తెలిపారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం వారు కార్యక్రమ వివరాల బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం కార్యక్రమ వివరాలు వెల్లడిస్తూ ఈ నెల 19, 20 తేదీలలో రెండు రోజులపాటు గుంటూరు-విజయవాడ మధ్య ఈ పాదయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో సామాన్య ప్రజల కష్టాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల మధ్య సోదరభావం పెంపొందించి దేశభక్తిని కలిగించటానికి మతసామరస్యాన్ని కాపాడదానికి ఇప్టా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో జరుగుతున్న పాదయాత్రలకు అనుసంధానంగా ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు-విజయవాడ మధ్య కవులు, కళాకారుల పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ మానవాళికి పెద్ద సమస్యగా తయారైన పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రజలు, ప్రభుత్వాలు కృషి చేయాలని, అందులో భాగంగానే ప్రజల చైతన్యానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాన్య ప్రజలు, రైతులు, కూలీలు, కార్మికులు, మహిళలు, విద్యార్థులను కలుసుకుంటూ వారి సమస్యలపై కళారూపాలు, పాటలు పాడుతూ వారిలో చైతన్యం కోసం ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంఘ సంస్కర్తలు దేశభక్తుల త్యాగాలను స్మరించ ుకుంటూ వారి స్ఫూర్తిని ప్రజలకు తెలియపరచాలని ఆలోచనతో ఈ పాదయాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు గాంధీ విగ్రహం వద్ద నుంచి 19వ తేదీ ఉదయం 10 గంటలకు పాదయాత్ర ప్రారంభమై పెదకాకాని, చిన్నకాకాని మీదుగా మంగళగిరి చేరుకుంటుంది. మరుసటి రోజు మంగళగిరిలో ప్రారంభమై విజయవాడ చేరుకొని భవానిపురంలో సాయంత్రం బహిరంగ సభ ద్వారా పాదయాత్ర ముగుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు కళారూపాలు ప్రదర్శిస్తారన్నారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా ప్రజానాట్య మండలి కార్యదర్శి ఆరేటి రామారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు ఆశా యూనియన్ మద్దతు

విశాలాంధ్ర-కడప రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆదివారం స్థానిక ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో ఈ నెల 21న విజయవాడలో జరిగే ఆశా యూనియన్ రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం విలేకరులతో ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి. సుభాషిణి, జిల్లా అధ్యక్షులు యు. మరియమ్మ గౌరవాధ్యక్షులు గుంటి. వేణుగోపాల్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసి బాదుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమ్మెను భగ్నం చేసే కుట్రలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశా కార్యకర్తలు విధులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆశాలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, అంతవరకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, సాధారణ సెలవులు, వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కార్యచరణ రూపొందించుకొనుటకు ఆశా కార్యకర్తల రాష్ట్రస్థాయి సదస్సు విజయవాడలో జరుగుతుందని ఈ సదస్సుకు జిల్లాలో ఉన్నటువంటి ప్రతి ఆశా కార్యకర్త పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

హృదయం లేదిక్కడ

గాజా బాలల ఆక్రందనలు వినండి
గాజా బాలలు యుద్ధంలో అంతమౌతున్నారు.
ప్రపంచమంతా పక్కన నుంచుని చూస్తోంది.
అది చూడగలదు కాని వినదలచుకోలేదు
కాదు కాదు వింటోంది కాని నోరు మెదపట్లేదు
న్యాయానికి హృదయం లేదిక్కడ
అదే మౌనం వహిస్తే
ఇక భయమనేదే లేని జగత్తును
ఎప్పటికి కల కనగలను?
తుపాకుల మోతలు లేని ప్రపంచాన్ని
బాంబులు బాధలేని జగాన్ని
ఎప్పటికి కల కనగలను?
మేము బాలలం!
బతకడానికి జన్మించాం- చావడానికి కాదు
చావడానికి కాదు- చావడానికి కాదు
గాజా మా బాలలను పిలుస్తోంది
గాజా మా బాలలను పిలుస్తోంది
మాకు ప్రేమ, జీవితం, న్యాయం కావాలి
ఏం జరిగినా సరే
అటువంటి ప్రపంచాన్ని మా చేతుల్తో సృష్టిస్తాం.
ధ్వంసమైన మా దేశాన్ని మేం పునర్నిర్మిస్తాం!
ఇది మా దృఢ నిర్ణయం
గాజా బలీయమైనది.
ఏం జరిగినా సరే-
మేం నిర్ణయించుకున్నాం గట్టిగా
ఆకాశమా! మాకు రక్షణ, శాంతిని వర్షించు!

పలస్తీనాలో వెస్ట్ బ్యాంక్ రాజధాని రొమెల్లాలో ఉన్న రమెల్లా ఫ్రెండ్స్ స్కూలు బాలలు, గాజాలో ఇజ్రేల్ బాంబు దాడుల్లో మరణిస్తున్న బాలల కోసం పాడిన విషాద బృంద గీతం. (వీడియో నుండి సేకరించినది)

అనువాదం: కొత్తపల్లి రవిబాబు

సాహితి

ఆర్ద్రతను నింపే కవిత్వపు భావసాంద్రత

కవిత్వపు చెట్టులో అక్షరాల పుష్పాలు వికసించినప్పుడు వాటిలోని భావాల పరిమళాలు మనల్ని ముప్పిరిగొంటుంటాయి.పసందైన పరిమళం పుష్పానికి నిండుదనం ఇచ్చినట్టు నిండైన, మెండైన భావం అక్షరానికి నిండుదనం ఇస్తుంది. అందులోని సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తుంటుంది. భావాక్షరాల కలబోత కవిత్వానికి వెన్నెలపోత. అక్షరాల ద్వారా కవిత్వపు మధురిమల్ని భావాలు మన మనసుల్లోకి వొలికిస్తుంటాయి. అవును... ఆలోచనలను అందమైన, బహుచందమైన, చందనచర్చితమైన అక్షరాలుగా మలిచేది రసరమ్యమైన భావాలే. అక్షరాల సరస్సులకు భావాల కలువలు సొగసులందిస్తుంటాయి. ఒక మధురమైన భావం రసరమ్య గుళికలా హృదయ రుగ్మతల్ని తొలగిస్తుంటుంది. అది సౌభ్రాతృత్వానికీ, సామరస్యానికీ సంకేతమైతే హృదయాలనిండా వసుధైక సుగంధాలను నింపుతుంది. రసరమ్య భావాలను నింపుకున్న అక్షరాలు తడితడిగా, ఆర్ద్రంగా హృదయాలను స్పృశిస్తాయి. ఆ ఆర్ద్రత నేత్రాల్లోంచి భాష్పాలై కురుస్తుంది. ఆర్ద్రమైన భావం బీజంలా హృదయంలో నాటుకుంటే అది మొక్కై, మానై స్నేహపు ఊడల్ని విస్తరింపజేస్తుంది. అది విభిన్న పార్శ్వాలలో జీవనసౌందర్యాలను దర్శింపజేస్తుంది. విసుగు వడగాడ్పులో సతమతమయ్యే మనిషిని అది ఓదార్పు మలయపవన వీచికలా స్పృశిస్తుంది. ఆర్ద్రమైన భావానికి అంతటి మహత్తు వుంది. అందుకే కవిత్వం తాను సౌందర్యంతో వెలిగిపోవడానికి ఆర్ద్రమైన భావం కోసం అనునిత్యం ఆరాటపడుతుంటుంది.

'రివ్వున ఆకాశానికి
ఉవ్వెత్తుగా లేస్తుంది మంట
సవ్వడి చెయ్యక భూమిబుగ్గలపై
చల్లటి నవ్వుసొట్టలా ముడుచుకుంటుంది బావి
పిల్లంగోవిలా లోతుగా
చల్లటి నీడల్ని ఊదుతో
వేళ్లనీ, పెదిమల్నీ
ఒళ్లంతటినీ ఆహ్వానిస్తుంది బావి
స్వరాల చల్లటి పిట్టలు వాలగా
పరచి సంగీతపు ఊడల్ని
మరచిపోయిన పాతవానల్ని
గురుతుకుతెస్తుంది బావిపిల్లంగోవి
నీడల విసనకర్రని విప్పి
ఎండలో సేదదీరుస్తుంటుంది చెట్టు
నీడల మడత విసనకర్ర బావి
వాడుకొమ్మంటుంది చేదలితో విప్పి
పాతవాసనల రహస్యనిద్రల్ని తట్టి
పాతస్మృతుల సుడుగుండాల్ని గాలించి
ఆ తపించే వర్తమానం కోసం
శైతల్యాన్ని తెస్తాయి చెట్టూ, బావి, పిల్లంగోవి'
('బావి' ఖండిక నుంచి)

అంటాడు మూడు కవితావస్తువుల్లో సమదృష్టితో భావసారూప్యాన్ని ఇనుమడింపజేస్తూ చెట్టుకవి ఇస్మాయిల్. ఇక్కడ మంటకూ, బావికీ వైరుధ్యాన్ని చెబుతూ రివ్వుమని ఎగిసే మంటలా కాకుండా ప్రశాంతతకు చిహ్నంగా భూమిబుగ్గపై సొట్టనవ్వులా బావి నిలిచిపోవడం అందమైన బావం. తమమీద పరుచుకున్న చెట్టునీడల్ని బావి పిల్లంగోవిలా బలంగా ఊదుతూ మనల్ని అలరించడం ఇక్కడి ఆర్ద్రత. ఆ ఆర్ద్రతే బావి చల్లదనపు సంగీతాన్ని సూచిస్తుంది. ఆ భావం అంతటితో ఆగదు, దానిని మరింత సౌందర్యవంతం చేస్తాడు కవి. ఆ చల్లదనం తాలూకు



స్వరాలు పిట్టలై
వాలిపోయిచెట్టు ఊడలన్నీ
సంగీతమయమైపోతాయి.
అప్పుడు మనం మరచిపోయిన
జ్ఞాపకాల జల్లుల్ని కురిపిస్తుంది

కవిత్వం. ఇక చెట్టు దగ్గరికొచ్చి దాని సేవకూ భావాన్ని తొడుగుతాడు కవి. అతని కవిత్వంలో దాని నీడలు విసనకర్ర అయిపోయింది. ఆ నీడలజాడల్ని పుక్కిటపట్టుకున్న బావి వాటిని మళ్లీమళ్లీ వాడుకొమ్మంటుంది. ఇప్పుడు చెట్టూ, బావీ, పిల్లంగోవీ... ఈ మూడింటికీ సమదృష్టినీ ఆపాదిస్తాడు కవి. అందుకే అవి రహస్య నిద్రలైపోయిన మధురజ్ఞాపకాల పాతవానల్ని తట్టిలేపి, వేదనామయ స్మృతుల సుడుగుండాల్ని వెతకి వాటినుంచి చల్లదనాన్ని సృష్టిస్తాయి. హృదయ నైర్మల్యం కోసం చెట్టు, బావి, పిల్లంగోవిలలోని ఆర్ద్రతను వెతికిపట్టుకుంది కవిత్వం. అందుకు కవిత్వానికి భావపరిమళం తోడైంది.

'చెట్టుకు దంతాలు మొలిచాక
వాన పళ్ల తోమింది
పున్నమి వలలో
చీకటి చేప ఎగిరిపడింది
నిద్ర వీధిలో
కలల గూర్ఖా తిరుగుతూనే వున్నాడు
హఠాత్తుగా కుక్కలు ఏడ్చాక
నడిరేయి మూత్రవిసర్జన చేసుకుంది
రాలిన పూలకాంతిని చూడలేక
దేవుడు కళ్లు మూసుకున్నాడు
పిల్లికి రేచీకటి వచ్చాక
మూషికాలు తోకలమీద నడిచాయి
ఉన్మాదగాలి చెట్టును చంపి
పత్తాలేకుండాపోయింది
పూలందం కన్న
సీతాకోక మనసు బరువెక్కువ
వానమొక్కలకు
వడ్లగింజలు కాచాయి
నది ఆకలిని
చేపలు ఎన్నడూ అడగలేదు
చీకటిమడతల్ని దీపం
సాపుచేయలేకపోయింది
వాననిద్రను
తూనీగ తోకతో లేపింది
('రంగులదాహం' ఖండిక నుంచి)

అంటాడు తన వైవిధ్య పదచిత్రాలతో కవితాలోకాన్ని అలరిస్తున్న వర్తమాన కవి తెలుగు వెంకటేశ్. ఈ కవితలోని భావాలు కవి విలక్షణ దృష్టితో వైవిధ్యాన్ని సంతరించుకున్నాయి. అందుకే వానలో తడుస్తూ శుభ్రమవుతున్న చెట్టుకు వాన చేత పళ్లు తోమించుకునే ఉపమ తోడైంది. ఈ కవితలోని ఒక్కో వాక్యంలోని భావాలు ఒకే రాత్రిలో వేరు వేరు ప్రకృతి దృశ్యాలను చూపించడమూ, ఊహించని ఉపమలు చోటుచేసుకోవడం ఇక్కడి ప్రత్యేకత. అందులో భాగమేచీకటి చేప కావడమూ.పున్నమి వలగా మారడమూ, నిద్ర అనే వీధిలో కల అనే గూర్ఖా తిరగడమూ. తనను మించిపోతోందన్న ద్వేషంతో పూలకాంతిని చూడలేక దేవుడు కళ్లు మూసుకోవడాన్ని దేవుడి విగ్రహానికి ఆపాదించడం, చెట్టును కూలదోసి గాలి పారిపోయిన ఉన్మాది అయిపోవడం, పూల అందాన్ని గ్రోలుతూ సీతాకోక అనుభవించే ఆనందాన్ని దాని మనసులో నిండిన ఆర్ద్రత అనే బరువుతో పోల్చడం, పిల్లికి రేచీకటి వచ్చేస్తే ఇక దాని బారిన పడతామన్న ఆలోచన తొలగి ఎలుకలు ధైర్యంగా తలెత్తుకు తిరగడం, తల్లి లాంటి నదిలో మనుగడ సాగించే చేపలు ఆ నది ఆకలిని మాత్రం ఎప్పుడూ తలచవని చెప్పడం, మొక్కలను అంటిపెట్టుకునుండే వర్షపు బిందువులు వడ్లగింజలైపోవడం ఇక్కడి కవిత్వం. ఒక భావం అందమైన అనుభూతుల పరిమళాల్ని కురిపిస్తే, మరో భావం వేదనామయ ఆర్తి వీచికై ఎగిసిపడవచ్చు. అయితే ఏ భావంలోనైనా ఆర్ద్రతే ప్రధానం. ఆ ఆర్ద్రతే కవిత్వానికి సార్థకత చేకూర్చే హృదయంగమవుతుంది. శతసహస్ర అనుభూతులకు మూలమవుతుంది. ఆత్మీయ వెన్నెలను ప్రసరింపజేసే పున్నమి అవుతుంది. కవిత్వాన్ని పతాకస్థాయిలో నిలబెట్టే చెలిమి అవుతుంది.

-డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,
సెల్: 9177732414

గ్రంథ సమీక్ష

కలం యోధుడు కోటంరాజు

కలం యోధుడు కోటంరాజు రామారావు, రచన: డా॥ సి.భవానీదేవి, ప్రచురణ: ఎమెస్కో బుక్స్ ప్రచురణాలయం, మూల్యం: రూ.100.

కోటంరాజు రామారావు కలం యోధుడు. దాదాపు నలభై సంవత్సరాల పాటు పత్రికా సంపాదకులుగా పనిచేశారు. సుదీర్ఘమైన పత్రికా సంపాదకులుగా ప్రసిద్ధి చెందారు. ఏ విషయమైనా తడుముకోక అలవోకగా మాట్లాడేవారు. ఆ మాటలకు శ్రోతలు మైమరచేవారు. స్వాతంత్ర్య సమయంలో వందలాది మందికి తమ ఉపన్యాసాలను వినిపించారు. ఇరవైఅయిదు పత్రికలకు సంపాదకత్వం వహించిన గొప్ప సంపాదకులు. భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించేంత వరకు నా కలం విశ్రాంతి తీసుకోదు అని ఘంటాపదంగా చెప్పారు. 'ఒకసారి జార్జిబెర్నార్డ్‌షా బొంబాయి వచ్చినపుడు రామారావుకి బోటులోనే ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ సందర్భంలో బ్రిటీషు వారికి ఇండియాను పాలించే హక్కు లేదని గట్టిగా చెప్పారు. వారితో ఉన్నప్పుడు కలిగిన అనుభూతులను రామారావు అక్షరబద్ధం చేశారు. కోటంరాజు వారు ఆదర్శ సంపాదకులు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని వ్యతిరేకించలేదు. వివిధ పత్రికలకు వారు చేసిన సేవ అపారం.

-గెల్లి రామమోహనరావు
ఫోన్: 0863 2357514

డాన్ డాన్ డార్విన్ అట..



అందుకే
ఈ అక్షర అగ్నిపర్వతమై
బ్రద్దలవుతోంది

సమస్త జీవరాశుల
సృష్టి రహస్యమూ అదే
పరిణామక్రమం

మానవాకారులెందరెందరో
జంతు సమూహాలతో కలిసి
లక్షల యేళ్ళనుండి సంచరిస్తూ
జీవనసమరం సాగిస్తున్న తరుణంలో

ఒకడు చక్రం
మరొకడు నిప్పు
ఇంకొకడు పోడు వ్యవసాయం
కనిపెట్టలేదా..!?

ఆ మహోజ్వల విజ్ఞానశాస్త్రం
మహా చులకన అయిపోయింది
మితిమీరిన స్వాతిశయం...

గళాలు పగిలేలా మహోద్వేగంతో
అరిచి ఘీంకరించినా
ఫలితం సున్నా
జీవవైవిధ్యంపై అహర్నిశలు
పరిశోధన చేసి
ప్రపంచాన్ని కుదుపు కుదిపిన డార్విన్

కారల్ మార్క్స్, ఏంగెల్స్ మెచ్చిన
శాస్త్రీయ జీవపరిణామ సూత్రం
ప్రపంచానికే శిరోధార్యం

ఆత్మసంశోధన అవశ్యం
ఒక్క చినుకు
నింగి నుండి నేలకు రాలాలంటే
అద్భుత దృగ్గోచర అంశను
అధ్యయనం చెయ్యాలి

శాస్త్రీయ దృక్పథంతో
మన తప్పిదాలకు
పరిష్కారం శోధించి
పర్యావరణ కాలుష్యంనుంచి పరిరక్షించాలి

-పత్తి సుమతి,
సెల్. 9108521585

జీవితం విలువను తెలియజేసే మజిలీ

ఒక మనిషి జీవనప్రయాణంలో ఎన్నో మజిలీలు. ప్రతి మజిలీ ఓ పాఠం నేర్పుతుంది. తద్వారా బతుకును సరిదిద్దుకుంటూ, ఆ మజిలీలన్నీ దాటి గమ్యం చేరాలి. అలా గమ్యం చేరేక్రమంలో ప్రతి మజిలీలో ఎదురయ్యే సంఘటనలే జీవితంలో విలువైన పాఠాలు. స్వంతూరు వదిలి వేలాది సాధారణ కుటుంబాలు బతుకుతెరువుకోసం ఎక్కడెక్కడో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అకస్మాత్తుగా ఏదైనా విపత్తు సంభవిస్తే దాన్ని తట్టుకుని నిలబడగలిగే ఆర్థిక ధైర్యం ఉండని జీవితాలు. అటువంటి జీవితాలు కరోనా సమయంలో ఒత్తిడికి లోనవుతూ ఎన్నో అష్టకష్టాలు అనుభవించాయి. కరోనా సమయంలోనే కాకుండా ఆ తర్వాత కూడా దాని పర్యవసానాన్ని అనుభవిస్తున్నాయి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా మరెన్నో కుటుంబాలు.

అలా ఓ సామాన్యకుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందులే నేపథ్యంగా ప్రముఖ రచయిత సంఘమిత్ర అందించిందే 'మజిలీ' నవల కథాసారాంశం. ఇందులో ప్రపంచ ప్రజలను భయాందోళనలకు గురిచేసిన కరోనా వైరస్ క్రిమి ఎలా పుట్టింది, ఎక్కడ పుట్టింది, అంచెలంచెలుగా ప్రపంచాన్ని చుట్టుముట్టిన తీరును, ఈ క్రమంలో ప్రపంచదేశాలు సృష్టించిన అలజడిని ఇందలి పాత్రల ద్వారా రచయిత తెలుపుతూ ఈ నవలలో స్పందించిన తీరు ఆసక్తికరంగా పాఠకులను చదివిస్తుంది. నవల ప్రారంభం కరోనా జాగ్రత్తల గురించి మొదలవుతుంది. ఉద్యోగాలైనా, నిర్మాణపనులైనా ఎక్కడుంటే అక్కడకు వెళ్ళవలసిందే. అలా ఉద్యోగం చేసేవారు, నిర్మాణ పనుల్లో ఎప్పుడు బిజీగా ఉండే ఇంకొందరి పాత్రలతో ముందుకు సాగుతూ కరోనా ఉధృతిసమయంలో తిరిగి స్వగ్రామాలకు ప్రయాణమయ్యే క్రమంలో ఎదుర్కొన్న ఇబ్బందులను, సంఘర్షణను తెలియజేస్తూ ముందుకు సాగుతుంది. ఇందులో నారాయణ, అతని భార్య, నర్స్‌గా చేసే మరదలు జాబిల్లి, మరిది, మావ, వారి చుట్టూ ఉన్న మరికొన్ని పాత్రలే ప్రధానంగా నవల వేగం పుంజుకుంటుంది. ఎవరికివారే అన్నరీతిలో ఎక్కడెక్కడో ఉండి తిరిగి స్వగ్రామాలు చేరుకునే క్రమంలో నారాయణ కుటుంబం ఇబ్బందులతో ముందుకు సాగుతుంది. అతని భార్య పిల్లాడిని ప్రసవించి మరణిస్తుంది. తన ఊరు బయలుదేరిన నారాయణకు మరదలు జాబిల్లి ఆ బస్సులోనే మరోచోట ఉద్యోగంలో జాయిన్ అయ్యేందుకు బయలుదేరుతుంది. జరిగిన విషయం తెలిపి అక్క పసిపాపను తన ఒడిని చేర్చుకుని బావ నారాయణ పక్కనే కూర్చుని ఊరు బయలుదేరడంతో కథ సుఖాంతమవుతుంది. కరోనా నేపథ్యంగా సాగే క్రమంలో మానసిక సంఘర్షణలు మనసులను మెలిపెట్టినా ముగింపు సుఖాంతమవడం ఆనందాన్నిస్తుంది. కథానేపథ్యం కరోనాగా ఎంచుకుని నవల అందించడం, అది పాఠకుల మెప్పుపొందడం అభినందనీయం.



మజిలీ (నవల)-సంఘమిత్ర
పేజీలు: 130, వెల: రూ.120/-
ప్రతులకు: విశాఖ రచయితల సంఘం
డోర్ నం.43-21-21, వి.ఆర్.నగర్,
దొండపర్తి, విశాఖపట్నం-530016.
సంఘమిత్ర, చరవాణి: 70932 77300

అముద్రిత రచనలకు ఆహ్వానం

శాక్రమెంటో తెలుగు వెలుగు - 2024 వార్షిక పత్రిక

మిత్రులారా...శాక్రమెంటో తెలుగు సంఘం ప్రచురించే "శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రిక" - 2023 నుండి వార్షికపత్రిక రూపంలో వెలువడుతుంది. అందులో భాగంగా మొదటి వార్షిక సంచిక జనవరి 15, 2023 న విడుదల అయింది. మా రెండవ వార్షిక సంచిక జనవరి 15, 2024 న విడుదల చేయడానికి ప్రయత్నాలు ఆరంభం అయ్యాయి. మా ఈ రెండవ వార్షిక సంచిక లో మీ రచనల ప్రచురణ నిమిత్తం మీకిదే మా ఆహ్వానం. మీ కథలు, కవితలు, మీరు సందర్శించిన ప్రాంతాల విశేషాలు, చిత్రాలు, వ్యాసాలు (ఆధ్యాత్మికం, పరిశీలన, పరిశోధన, విమర్శ తదితర), పుస్తక పరిచయం, జోక్స్, స్థానిక తెలుగు కుటుంబాలు లేదా వారి పిల్లల ప్రతిభా పాటవాల గురించి మాకు తెలియజేయాలనుకొంటే http://lekhini.org ను లేదా ఆన్‌లైన్‌లో Google ఇన్‌పుట్ సాధనంను https://www.google.com/intl/te/inputtools/try/ ఉపయోగించి తెలుగులో, టైపు చేసి మాకు పంపండి. మీ రచనలు మాకు పంపవలసిన ఈమెయిల్ : telugusac@yahoo.com. పిల్లలు, పెద్దలు వేసిన బొమ్మలను, తీసిన ఫోటోలను మాకు పంపవచ్చు. ఆపై శాక్రమెంటో తెలుగు వెలుగు వార్షిక సంచికలో వాటిని పరిశీలించి ప్రచురించే బాధ్యత మాదేనని సవినయంగా మీకు మనవి చేస్తున్నాము. రచయితల అముద్రిత స్వీయ రచనలు మాత్రమే పరిశీలనకు స్వీకరిస్తారు. స్వంత బ్లాగులు, స్వంత వెబ్‌సైట్స్, స్వంత పత్రికలు మొదలైన వాటిల్లో ప్రచురించుకున్న లేదా ప్రచురించిన రచనలు పరిగణించరు.

మీ రచనలు మాకు అందవలసిన ఆఖరి తేదీ: డిసెంబర్ 20, 2023. "శాక్రమెంటో తెలుగు వెలుగు" పత్రికలోని రచనల సర్వహక్కులూ ఆయా రచయితలకూ, రచయిత్రులకూ మాత్రమే చెందుతాయి. రచనలలోని అంశాలకూ, అభిప్రాయాలకూ, అచ్చుతప్పులకూ తత్సంబంధిత రచయిత/రచయిత్రులదే బాధ్యత. మీ రచనలకు ఏవిధమైన పారితోషికం చెల్లించరు. గమనించగలరు.

"శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రిక" పూర్వ సంచికలు ఈ లంకెలో ఉంచారు: https://sactelugu.org/tags-patrika/. శాక్రమెంటో తెలుగు వెలుగు సంచిక మీ ఈ మెయిలుకు రంచనుగా అందాలంటే, ఈరోజే టాగ్స్ న్యూస్ లెటర్‌కు ఈ లంకె ద్వారా నమోదు చేసుకోవలసినదిగా మనవి: https://tinyurl.com/jointags .

ధన్యవాదాలు! "శాక్రమెంటో తెలుగు వెలుగు" పత్రిక సంపాదక బృందం.

కవిసంధ్య డా. భట్టిప్రోలు దుర్గాలక్ష్మీ ప్రసన్న స్మారక వచన కవితల పోటీలు - 2024

మార్చి 21, ప్రపంచ కవితా దినోత్సవ సందర్భంగా, సుధామగారి "ఓసారి చూడండి ... అంతే" (వాట్సప్ ప్రసారసంచిక), 'గంధకుటి' సౌజన్యంతో వచనకవితల పోటీని నిర్వహిస్తున్నాం. ప్రథమ బహుమతి : 3000/-రూ - ద్వితీయ బహుమతి : 2000/- రూ. తృతీయ బహుమతి : 1000/-రూ. ప్రోత్సాహక బహుమతులు 5 కవితలకు ఒక్కొక్క కవితకు 500/-రూ. కవితల ఇతివృత్తం వర్తమాన సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేది అయివుండాలి. కవిత రెండు పేజీల నిడివికి మించరాదు. ఒక కవి ఒక కవితను మాత్రమే పంపాలి. కవితలు పోస్టు,రిజిష్టర్ పోస్టు, కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి . ఈ మెయిల్, వాట్సప్‌లో పంపిన కవితలు పరిశీలించబడవు.

కవితలు పంపడానికి చివరితేదీ : 31 జనవరి 2024. కవితల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఎటువంటి సంప్రదింపులకు అవకాశం లేదు. బహుమతులు మార్చి 21వ తేదీన జరిగే ప్రపంచకవితా దినోత్సవ సదస్సులో ప్రదానం చేయబడతాయి.

కవితలు పంపవలసిన చిరునామా:
దాట్ల దేవదానం రాజు, కన్వీనర్, కవితల పోటీ, జిక్రయనగర్, యానాం(పోస్ట్), పిన్ :533464
వయా: కాకినాడ తూర్పుగోదావరి జిల్లా- ఆంధ్రప్రదేశ్, ఫోన్:9440105987.

నాగపూర్‌లో నిరసనాగ్రహం

- కర్మాగారంలో పేలుడు... తొమ్మిది మంది మృతి
- రోడ్డుపై బైఠాయించిన స్థానికులు, కార్మికుల బంధువులు

నాగపూర్ : నాగ్‌పూర్ జిల్లాలో పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో ఆదివారం జరిగిన పేలుడులో తొమ్మిది మంది మృతి చెందిన ఘటనపై స్థానికులు, బాధిత కార్మిక బంధువుల నుంచి తీవ్ర నిరసనాగ్రహం వ్యక్తమయ్యింది. కర్మాగారం సమీపంలో ఒక రహదారిపై నిరసనకారులు బైఠాయించారు. మృతదేహాలను చూడటానికి వారిని ప్రాంగణంలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. అనంతరం జనాన్ని చెదరగొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆ వర్గాల సమాచారం ప్రకారం, బాధితుల మృతదేహాలు మధ్యాహ్నం 3 గంటల సమయానికి కూడా కర్మాగారం ప్రాంగణంలోనే ఉన్నాయి. ఇక్కడ ఉదయం 9 గంటలకు పేలుడు జరిగింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడినట్లు పోలీసులు వివరించారు. జిల్లా కేంద్రానికి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బజార్‌గావ్‌లో ఉన్న సోలార్ ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీ ప్రవేశ ద్వారం వద్ద మృతదేహాలను తరలించేందుకు అనేక అంబులెన్స్‌లను ఉంచారు. అయితే, స్థానికులు, కార్మికుల బంధువులు సహా దాదాపు 200 మంది ఫ్యాక్టరీ ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనాస్థలికి సమీపంలో పేలుడు పదార్థాలు ఉన్నాయని పోలీసు ఉన్నతాధికారి పీటీఐకి తెలిపారు. పేలుడు పదార్థాలను భద్రపరిచేందుకు బాంబు నిర్వీర్య బృందాలు ఘటనా స్థలంలో ఉన్నాయన్నారు. పేలుడు పదార్థాలను భద్రపరిచే ప్రక్రియ కొనసాగుతోందని, ఆ తర్వాత మృతదేహాలను వెలికితీస్తామని అధికారి వెల్లడించారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు, బాధితుల బంధువులు ఫ్యాక్టరీ బయట అమరావతి-నాగ్‌పూర్ రహదారిని దిగ్బంధించారు. తమ బంధువుల మృతదేహాలను చూసేందుకు తమను ప్రాంగణంలోకి అనుమతించాలని డిమాండ్ చేస్తూ కర్మాగారం ప్రవేశ ద్వారం ముందు నినాదాలు చేస్తూ రహదారిపై బైఠాయించారు. అనంతరం పోలీసులు జనాన్ని చెదరగొట్టారని ఒక అధికారి తెలిపారు. ఆ ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతులలో ఆర్తి సహారే తండ్రి విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9.30 గంటలకు తన కుమార్తె మరణం గురించి తనకు సందేశం వచ్చిందని, తదుపరి సమాచారం కోసం ఇంకా వేచి ఉన్నట్లు చెప్పారు. పేలుడు కారణంగా కర్మాగారం భవనానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లిందని పోలీసులు తెలిపారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో ఈ సంఘటన దురదృష్టకరమ పేర్కొంటూ, తొమ్మిది మంది మృతికి సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుందని, ఈ నిర్ణయానికి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. సోలార్ ఇండస్ట్రీస్‌లో జరిగిన పేలుడులో ఆరుగురు మహిళలు సహా తొమ్మిది మంది మరణించారని ఫడ్నవీస్ వెల్లడించారు. సాయుధ బలగాల కోసం డ్రోన్లు, పేలుడు పదార్థాలను తయారు చేసే కంపెనీ ఇది. ఈ బాధాకరమైన సందర్భంగా బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన అన్నారు.

బీహార్‌లో పూజారి హత్య, కనుగుడ్లు పెరికివేత

పాట్నా: బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లాలో వారం కిందట అదృశ్యమైన పూజారి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కాల్పులు జరిపి ఆయనను హత్య చేసినట్లు అనుమానించారు. కనుగుడ్లు పెకలించడంతోపాటు ప్రైవేట్ భాగాలు కోసి ఉండటం చూసి ఆగ్రహంతో రగిలిపోయారు. ఆందోళనకు దిగిన స్థానికులు పోలీసులపైకి రాళ్లు రువ్వడంతోపాటు ఒక వాహనానికి నిప్పంటించారు. దీంతో దానాపూర్ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన 32 ఏళ్ల మనోజ్ కుమార్ స్థానిక శివాలయంలో పూజారి. సోమవారం మధ్య రాత్రి తర్వాత గుడి నుంచి బయటకు వెళ్లిన ఆయన అదృశ్యమయ్యాడు. బీజేపీ మాజీ డివిజన్ అధ్యక్షుడైన అశోక్ కుమార్ షా తన సోదరుడు మనోజ్ కనపడకపోవడంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, శనివారం గ్రామ శివారులోని చెట్లపొదల్లో పూజారి మనోజ్ కుమార్ మృతదేహం కనిపించింది. ఆయనపై కాల్పులు జరిపి హత్య చేశారు. అలాగే కనుగుడ్లు పెకలించి ఉన్నాయి. నాలుక, ప్రైవేట్ భాగం వద్ద కోసిన గాయాలున్నాయి. ఈ విషయం తెలుస్తున్న గ్రామస్తులు ఆగ్రహంతో రగిలిపోయారు. పోలీసుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. జాతీయ రహదారిని దిగ్బంధించి నిరసనకు దిగారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఒక పోలీస్ వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘర్షణలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు.

పేపర్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ : తూర్పు ఢిల్లీ మయూర్ విహార్ ఫేస్1 ప్రాంతంలోని ఒక పేపర్ గోడౌన్‌లో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. పేపర్ గోడౌన్‌లో మంటలు చెలరేగడంతో ఘటనా స్థలానికి హుటాహుటిన అగ్నిమాపక యంత్రాలను తరలించారు. అగ్నిప్రమాదానికి కారణాలేంటనేది ఇంకా తెలియరాలేదని ఈ ఘటనలో ఎవరూ గాయపడిన సమాచారం రాకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న 23 అగ్నిమాపక యంత్రాలు మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. పేపర్ గోదాము నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ ఆవరించింది. అగ్నిప్రమాద ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సిఉంది.

మే నుంచి 'అయోధ్య' మసీదు నిర్మాణం

లక్నో: అయోధ్యలో ప్రతిపాదిత మసీదు నిర్మాణం 2024, మే నుంచి మొదలు కాబోతోంది. ఈ మేరకు ప్రాజెక్టు వర్గాలు తెలిపాయి. అయోధ్య ధన్నిపూర్‌లో మసీదు నిర్మాణానికిగాను నిధి సేకరణ కోసం వేర్వేరు రాష్ట్రాల్లో ఇంచార్జీల నియామకాలను ఫిబ్రవరిలో చేపట్టాలని ఇండో- ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ ట్రస్ట్ భావిస్తోంది. మసీదు నిర్మాణ బాధ్యతలను ఈ ట్రస్ట్ చేపట్టిన విషయం విదితమే. ఫిబ్రవరిలో మసీదు తుది డిజైన్ సిద్ధమవుతుందని, ఆపై ఆమోదం కోసం పరిపాలన యంత్రాంగం వద్దకు పంపుతామని, ఆపై సైట్ కార్యాలయాన్ని కాంపెక్స్‌లో ఏర్పాటు చేస్తామని ప్రధాన ట్రస్టీ జుఫర్ ఫారూఖీ తెలిపారు. వచ్చే ఏడాది మేలో మసీదు నిర్మాణ పనులను మొదలు పెట్టగలమని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. మసీదు డిజైన్‌లో భారీ మార్పులు, పరిమిత నిధుల కారణంగా 'మహమ్మద్ బిన్ అబ్దుల్లా అయోధ్య మసీదు' నిర్మాణాన్ని ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందని చెప్పారు. ముందనుకున్నట్లు 15వేల చదరపు అడుగులకు బదులు 40వేల చదరపు అడుగుల స్థలంలో నిర్మాణం జరిగేలా డిజైన్ రూపు దిద్దుకుంటోందన్నారు. విరాళాలు సేకరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఫిబ్రవరిలో నిర్ణయిస్తామని చెప్పారు. 'విరాళాల సేకరణ క్లిష్టమైన అంకం. బృహత్ కార్యాన్ని చేపట్టాం. దీనిని అందరి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తీర్చిదిద్దే బాధ్యత మాపై ఉంది. ఇది వ్యయంతో కూడుకున్నది కాబట్టి నిధి సేకరణ అనివార్యం' అని ఫారూఖీ వెల్లడించారు. మసీదు క్లాంపెక్స్‌లో ఆసుపత్రి, గ్రంథాలయం, సామూహిక వంటశాల, మ్యూజియం కూడా ఉంటాయని ట్రస్ట్ కార్యదర్శి హుస్సేన్ చెప్పారు. మసీదు నిర్మాణం ఎప్పుడు పూర్తి అవుతుదనేది వచ్చే విరాళాలపై ఆధారపడి ఉందని అన్నారు.

పార్లమెంటు భద్రతా ఉల్లంఘన తీవ్రమైన అంశం

బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా : న్యూఢిల్లీలోని పార్లమెంటు కొత్త భవనంలో భద్రతా ఉల్లంఘనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఇది చాలా తీవ్రమైన విషయమని అన్నారు. 2001 పార్లమెంటు ఉగ్ర దాడి వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన భారీ భద్రతా ఉల్లంఘనలో జీరో అవర్‌లో ఇద్దరు వ్యక్తులు పబ్లిక్ గ్యాలరీ నుంచి లోక్‌సభ ఛాంబర్‌లోకి దూకి, డబ్బాల నుంచి పసుపు రంగు పొగను విడుదల చేసి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఎంపీలు పట్టుకున్నారు. 'పార్లమెంటు భద్రతా ఉల్లంఘన తీవ్రమైన అంశం. పెద్ద లోపం జరిగింది. కేంద్ర హోం మంత్రి ఇప్పటికే ఆ విషయాన్ని అంగీకరించారు. వారు దానిని దర్యాప్తు చేయనివ్వండి' అని బెనర్జీ ఢిల్లీకి బయలుదేరే ముందు ఇక్కడి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విలేకరులతో అన్నారు. బెనర్జీ, ఆరోగ్య కేంద్రాలకు కాషాయ రంగు వేయాలన్న కేంద్రం ఆదేశాన్ని ప్రస్తావిస్తూ, ప్రజలు ఏమి తినాలో లేదా ధరించాలో కూడా ఆ పార్టీ నిర్ణయించడానికి ప్రయత్నిస్తోందంటూ బీజేపీని విమర్శించారు. తృణమూల్ కాంగ్రెస్ అగ్ర నేత ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సమావేశంలో పాల్గొనేందుకు దేశ రాజధానికి వెళుతున్నారు. పశ్చిమ బెంగాల్ బకాయి నిధులను విడుదల చేయాలని కోరేందుకు ఆమె డిసెంబరు 20న ప్రధాని నరేంద్ర మోదీని కూడా కలవనున్నారు.

తుపాను బాధితులకు రూ.6 వేల సాయం

పంపిణీ చేసిన తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆదివారం మిచౌంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు రూ.6 వేల నగదు సహాయం పంపిణీని ప్రారంభించారు. చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లోని దాదాపు 25 లక్షల కుటుంబాలకు ఈ నగదు సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,486.93 కోట్లు కేటాయించింది. భారీ వరదల కారణంగా తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాలలో ఒకటైన వేలచేరిలో మహిళా కుటుంబ పెద్దలకు స్టాలిన్ నగదు సాయం పంపిణీని ప్రారంభించారు. చెన్నై, సమీప ప్రాంతాల ప్రజలకు వరద సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. డీఎంకే కార్యకర్తలకు లేఖ రాస్తూ, ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేకుండా చెన్నై, సమీప ప్రాంతాల్లో వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసిన కేంద్ర ప్రభుత్వ బృందం రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించిందని సీఎం స్టాలిన్ అన్నారు. 'అలాంటి ప్రశంసలు ప్రభుత్వ అంకితభావం, నిజాయితీ పనికి 'సర్టిఫికెట్' మాత్రమే కాదు. ఈ విషయంలో రాజకీయాలు చేయాలనుకునే వారి ముఖం మీద చెంపదెబ్బ కూడా' అని పేర్కొన్నారు. రేషన్ దుకాణాల్లో నగదు పంపిణీ తేదీ, సమయాన్ని పేర్కొంటూ టోకెన్ల పంపిణీ కసరత్తు రెండు రోజుల క్రితం ప్రారంభమైంది. టోకెన్ పొందని వారు నగదు సహాయం పొందేందుకు చౌక ధరల దుకాణాలలో దరఖాస్తులను సమర్పించవచ్చని ప్రభుత్వ పత్రికా ప్రకటన పేర్కొంది. మొత్తం 24,25,336 కుటుంబాలు ఈ పరిహారం ద్వారా లబ్ధి పొందుతాయి. చెన్నైలో అత్యధిక మంది లబ్ధిదారులు దాదాపు 13.72 లక్షల కుటుంబాలు, తిరువళ్లూరు (6.08 లక్షలు), చెంగల్పట్టు (3.12 లక్షలు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కాంచీపురంలో 1,31,149 మంది రేషన్ కార్డుదారులు లబ్ధి పొందనున్నారు. నగదు సహాయం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) దుకాణాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, అలాగే, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్య పంపిణీ చేస్తారు. డిసెంబరు 3, 4 తేదీలలో తుపాను కారణంగా చెన్నై, సమీపంలోని మూడు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు సీఎం డిసెంబర్ 9న రూ.6,000 నగదు సాయం ప్రకటించారు. మిచౌంగ్ తుపాను కారణంగా సంభవించిన వరదల కారణంగా నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల బృందం కొద్ది రోజుల క్రితం చెన్నై, పొరుగు ప్రాంతాలను సందర్శించింది.

జైళ్లలో మాదక ద్రవ్యాల విక్రయం

నవజ్యోత్ సింగ్ సిద్ధూ ఆరోపణ

చండీగఢ్: పంజాబ్ జైళ్లలో మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా అమ్ముతున్నారని ఆ రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నవజ్యోత్ సింగ్ సిద్ధూ ఆరోపించారు. తాను చెప్పింది తప్పని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను నియంత్రించడంపై చర్యలు తీసుకోవడం లేదంటూ పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. శాంతి,భద్రతలు, డ్రగ్ మాఫియా, జైళ్ల విధానాలపై వారంలోగా నివేదిక అందజేయాలని హైకోర్టు కోరిందన్నారు. అయితే జైళ్ల శాఖ మంత్రి అయిన సీఎం భగవంత్ మాన్ ఏం చేశారని సిద్ధూ ప్రశ్నించారు. 'జైళ్లలో డ్రగ్ ట్యాబ్లెట్లు అమ్ముతున్నారు. నేను చెప్పింది అబద్ధమని రుజువైతే రాజకీయాల నుంచి తప్పుకుంటా' అని అన్నారు. మరోవైపు, పంజాబ్‌లో పెరుగుతున్న అప్పులు, శాంతిభద్రతల పరిస్థితిపై ఆప్ ప్రభుత్వంపై సిద్ధూ విమర్శలు గుప్పించారు. కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఆ అవసరాలకు వినియోగించడం లేదని, ఈ కారణంగానే పంజాబ్‌కు అందాల్సిన రూ.8,000 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. కేంద్ర పథకంలో 40 శాతం వాటా ఇవ్వడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని విమర్శించారు. కాగా, 1988లో రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించిన కేసులో సిద్ధూకు సుప్రీంకోర్టు ఒక ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది. దీంతో ఆయన 10 నెలలు జైలులో ఉన్నారు. అయితే సత్ప్రవర్తన కారణంగా గడువుకు ముందే జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం పంజాబ్ రాజకీయాలపై దృష్టిసారించారు.

మాన్ నివాసం వద్ద ఆందోళన

యువజన కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

చండీగఢ్ : పంజాబ్ సీఎం భగవంత్ మాన్ నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నించిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఆదివారం అడ్డుకున్నారు. శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ఆరోపిస్తూ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం మాన్ నివాసం వైపు ప్రదర్శనగా బారికేడ్లను దాటి బలవంతంగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు వారిని చెదరగొట్టేందుకు జల ఫిరంగులను ప్రయోగించారు. అనేక మంది యువజన కాంగ్రెస్ నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఆందోళనకారులు మాన్ నివాసం వైపు వెళ్లకుండా పంజాబ్ కాంగ్రెస్ భవన్ దగ్గర పోలీసులు బారికేడ్లు వేశారు. ఆందోళనకారులు బారికేడ్ల గుండా బలవంతంగా వెళ్లేందుకు ప్రయత్నించగా, వారిని చెదరగొట్టేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. నిరసన ప్రదర్శనకు ముందు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా నిర్వహించి ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' పై వరుస పోస్టలలో, యువజన కాంగ్రెస్ పంజాబ్ అధ్యక్షుడు మోహిత్ మొహింద్రా, ఆప్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు 'కుప్పకూలిపోయాయని' ఆరోపించారు. 'పంజాబ్‌లో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు వ్యతిరేకంగా మేము ఐక్యంగా ఉన్నాము. ప్రభుత్వ అసమర్థత స్పష్టంగా ఉంది. అయితే ఐవైసీపంజాబ్ సురక్షితమైన. మెరుగైన పంజాబ్ కోసం పోరాడటానికి నిబద్ధతతో ఉంది' అని పేర్కొన్నారు. 'ఈరోజు యువజన కాంగ్రెస్ చేసిన నిరసన ప్రదర్శన కంటే ఎక్కువ. ఇది ఆప్ పంజాబ్‌కు అల్టిమేటం. పంజాబ్ యువత సురక్షితమైన రాష్ట్రం కోసం మాతో కలిసి గళం విప్పారు. మేము మౌనంగా ఉండం. మేము మా హక్కుల కోసం పోరాడతాం. పంజాబ్‌ను అందరికీ సురక్షితమైన స్వర్గధామంగా మార్చడానికి ప్రయత్నిస్తాం. ఇది పంజాబ్ భవిష్యత్తు కోసం పోరాటం' అని ఆయన అన్నారు. మొహింద్రా నిరసన, యువజన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్న చిత్రాలను కూడా పంచుకున్నారు.

గడ్డకట్టిన కశ్మీర్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో చలి గజగజ వణికిస్తోంది. అనేక చోట్ల నీరు గడ్డకట్టేస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. కొన్ని ఏరియాల్లో అయితే మైనస్ డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పతనమయ్యాయి. దాంతో అక్కడి సరస్సులు, కొలనుల్లోని నీరు గడ్డకట్టింది. దాల్ సరస్సులో కూడా లోపలి వైపు ఉన్న నీరు గడ్డకట్టుకుపోయింది. జమ్ముకశ్మీర్‌లో గత కొన్ని రోజులుగా పశ్చిమ గాలులు వీస్తున్నాయని, ఆ గాలుల ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షాలు పడటమేగాక విపరీతంగా మంచు కురుస్తున్నదని, దాంతో ఉష్ణోగ్రతలు బాగా పడిపోతున్నాయని అధికారులు చెపుతున్నారు. శనివారం రాత్రి శ్రీనగర్‌లో మైనస్ 5.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు.

2047 నాటికి 'అందరికీ బీమా'లో ఎల్ఐసీ కీలక పాత్ర

సంస్థ చైర్మన్ సిద్ధార్థ మహంతి

న్యూఢిల్లీ : '2047 నాటికి అందరికీ బీమా' సాధించే ప్రయత్నంలో ఎల్ఐసీ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల కోసం రూపొందించిన ఉత్పత్తిని ప్రారంభించాలని యోచిస్తోందని ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి తెలిపారు. 'వాస్తవానికి బీమా అవసరమయ్యే గరిష్ఠ గ్రామీణ ప్రజలకు ఎలా కవర్ చేయాలనే దానిపై దృష్టి ఉంటుంది. రాబోయే రోజుల్లో గ్రామీణ వాటా కూడా మా మొత్తం వ్యాపార నిధికి చేరుకుంటుంది' అని ఆయన పీటీఐకి చెప్పారు. '2047 నాటికి అందరికీ బీమా' అనే లక్ష్యాన్ని సాధించేందుకు, ఎల్ఐసీ చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, ఆ దిశగా బీమా సంస్థ ఇప్పటికే పని ప్రారంభించిందని ఆయన అన్నారు. 'నేను నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐకు కృతజ్ఞతలు చెప్పాలి. ఇప్పటికే 'బీమా విస్తార్' అనే మిశ్రమ ఉత్పత్తిని ప్రతిపాదించింది. ఈ ఉత్పత్తిలో జీవిత, ఆరోగ్యం, ఆస్తి బీమా ఉంటుంది' అని ఆయన చెప్పారు. ఆ ఉత్పత్తులను విక్రయించడానికి బీమా వాహక్ నిమగ్నమై ఉంటుందని, ఇది మహిళా కేంద్రీకృత పంపిణీ ఛానల్ మోడల్‌గా ఉంటుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రపంచ సగటుతో పోలిస్తే భారతదేశంలో బీమా వ్యాప్తి తక్కువగా ఉంది. ఈ ఏడాది జూన్‌లో భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏ) గ్రామ పంచాయతీల స్థాయిలో ప్రత్యేక పంపిణీ మార్గాన్ని స్థాపించాలని కోరుతూ 'బీమా వాహకుల' కోసం ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. 'ప్రాజెక్టు డైవ్ (డిజిటల్ ఆవిష్కరణ, విలువ పెంపుదల) ద్వారా మా వాటాదారులు, ఖాతాదారులు, మధ్యవర్తులు, మార్కెటింగ్ వ్యక్తులు, ప్రతి ఒక్కరికీ ఉత్తమమైన డిజిటల్ కార్యక్రమాలను అందించడమే మా లక్ష్యం' అని ఆయన తెలిపారు. వినియోగదారులు ఆఫీసుకు రావలసిన అవసరం లేదు. ఇంట్లోనే కూర్చుని మొబైల్‌లో అవసరమైన సేవలను పొందగలరు. మేము ఫిన్‌టెక్‌పై కూడా దృష్టి పెడుతున్నాము. వ్యాపారాన్ని విస్తరించడంలో దాని సామర్థ్యాన్ని ఉపయోగిస్తాము' అని ఆయన చెప్పారు. ఎల్ఐసీ తన స్వంత ఫిన్‌టెక్ విభాగాన్ని వ్యాపార నమూనాగా అభివృద్ధి చేసే అవకాశాలను కూడా అన్వేషిస్తోందని అన్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో గృహోపకరణాలకు గిరాకీ

పండుగలప్పుడు 15-20 శాతం పెరిగిన అమ్మకాలు

వేర్వేరు ఆఫర్లతో ఆకర్షిస్తున్న ప్రముఖ కంపెనీలు

న్యూఢిల్లీ: పెళ్లిళ్ల సీజన్ వచ్చినదంటే గృహోపకరణలు, ఎలక్ట్రానిక్ పరికరాలకు గిరాకీ పెరుగుతుంది. పండుగల సేల్స్ ముగిసే క్రమంలో పెళ్లిళ్ల సీజన్ రావడంతో ప్రముఖ కంపెనీలు తమ కస్టమర్లను ఆకర్షించేందుకు వేర్వేరు ఆఫర్లు ఇస్తున్నాయి. పండుగల సేల్స్‌లో భాగంగా ప్రీమియం వస్తువుల అమ్మకాల్లో 15-20శాతం వృద్ధిని చూసిన కంపెనీలు ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ అమ్మకాలను పెంచుకోవడంపై దృష్టిని కేంద్రీకరించాయి. నవంబరులో లభించిన స్పందనతో ఎల్‌జీ, గోద్రేజ్, పానాసోనిక్ వంటి ప్రముఖ కంపెనీలు పండుగ ఆఫర్లను పొడిగించాయి. వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, టీవీలు, మైక్రో ఓవెన్లతో పాటు వంట గది వస్తువులను సులభంగా కొనేందుకు కొన్ని స్కీములనూ ప్రవేశపెట్టాయి. ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్‌లో తమ పరిశ్రమకు మంచి ఊపు మీద ఉందని కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, అప్లియెన్సెస్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సీఈఏఎంఏ) అధ్యక్షుడు సునీల్ వచాని తెలిపారు. వస్తు విక్రయాలు మరింత పెరుగుతాయని చెప్పారు. దీపావళి నుంచి పండుగ సేల్స్ బాగున్నాయని, నవంబరులో మంచి స్పందన వచ్చిందని తెలిపారు. పెళ్లిళ్ల సీజన్‌లోనూ ఇదే ట్రెండ్ కొనుగుతుందని ఆకాంక్షించారు. పారిశ్రామిక సంఘం సీఏఐటీ నిర్వహించిన సర్వే ప్రకారం నవంబరు 23 నుంచి మొదలైన పెళ్లిళ్ల సీజన్‌లో 35 లక్షల వివాహాలు జరగనున్నాయని, రూ.4.25లక్షల కోట్ల వ్యాపారం జరిగే అంచనా ఉందని తేలింది. గోద్రేజ్ అప్లయెన్సెస్ బిజినెస్ హెడ్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కమల్‌నంది మాట్లాడుతూ పెళ్లిళ్ల సీజన్‌లో రెఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్ల వంటి వాటికి గిరాకీ ఉంటుందని, గ్రామాల్లోనూ అమ్మకాలు పెరుగుతాయని అన్నారు. అయితే ద్రవ్యోల్బణం కారణంగా ఈ ఏడాది పెళ్లిళ్లలో గిఫ్ట్ అప్లయెన్సెస్ తగ్గినట్లు తెలిపారు. ఈ పరిస్థితిలో పెళ్లిళ్ల సీజన్ అమ్మకాలను అంచనా వేయడం కాస్త కష్టమేనన్నారు. వినియోగ డిమాండ్ దృష్ట్యా అదనపు వారెంటీ, కాంబో ఆఫర్లు ఇస్తున్నట్లు కమల్ నంది తెలిపారు. దక్షిణ కొరియాకు చెందిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ కూడా పెళ్లిళ్ల సీజన్ కోసం క్యాష్ బ్యాక్‌లు, కాంబో ఆఫర్లతో కస్టమర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. పెళ్లిళ్ల కారణంగా మార్కెట్ బాగుందని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సీనియర్ వీపీ ఆశీశ్ అగర్వాల్ అన్నారు. పానాసోనిక్ మార్కెటింగ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఫుమియాసు ఫుజిమోరి మాట్లాడుతూ ప్రస్తుత డిమాండ్ దృష్ట్యా పండుగ ఆఫర్లను పొడిగించినట్లు చెప్పారు. సూపర్ ప్లాస్ట్రోనిక్స్ ప్రై.లి. (ఎస్‌పీపీఎల్)లోనూ అమ్మకాల జోరు సాగుతోంది. అంతర్జాతీయ బ్రాండ్లు 'బ్లాపుంక్ట్, థామ్సన్, కొడాక్, వైట్-వెస్టింగ్ హౌస్' వంటివి భారతీయ విపణిలో విక్రయించే లైసెన్సును ఈ సంస్థ కలిగివున్నది.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి
- శ్రీకాళహస్తి బహిరంగసభలో ఓబులేసు
- ఏఐటీయూసీ తిరుపతి జిల్లా మహసభలు ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కష్టజీవులకు అనుకూలం కాదు. కేంద్ర ప్రభుత్వం కార్మికవర్గంపై కత్తి దూస్తోంది. కార్మికుల హక్కులు కాలరాస్తోంది. కార్మికులు లేకుండా దేశ పురోగతి లేదు. దేశాభివృద్ధి మొత్తం ప్రజల సొమ్ము. పాలకులు ఈ సొమ్మును అంబానీ, అదానీ వంటి వారికి పప్పు, బెల్లంలా పంచిపెడుతున్నారు. కష్ట జీవుల కడుపు కొడుతున్నారు. కష్టజీవులకు న్యాయం కోసం ఎర్ర జెండాలు ఏకం కావాలి. కార్మిక శక్తి తలచుకుంటే ఏమైనా సాధించవచ్చు" అని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా ప్రథమ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి

రోజున వేలాది మందితో శ్రీకాళహస్తి పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఓబులేసు మాట్లాడుతూ ఏఐటీయూసీకి 104ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భావం నుంచి కార్మికుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తోందన్నారు. ఇలాంటి యూనియన్‌కు కార్మికవర్గం అండగా నిలబడాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై ఓబులేసు ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో కార్మిక హక్కులను కాలరాశారన్నారు. కార్మికుల హక్కులు కాపాడే 44 చట్టాలను రద్దు చేశారన్నారు. రూ.3లక్షల కోట్ల విలువ చేసే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రూ.35వేలకే ప్రైవేటీకరిస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కుకు చెందిన 29వేల ఎకరాల భూమిని ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. దేశంలో ఉన్న 18 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఇప్పటికే ఆరింటిని నరేంద్రమోదీ ప్రభుత్వం కనుమరుగు చేసిందన్నారు. ఇవే కాకుండా రైల్వే, జీవిత బీమా, విద్యుత్, కృష్ణపట్నం ఓడరేవు, బొగ్గుగనులు ఇలా ఎన్నింటినో మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇంకా కొంతకాలం గడిస్తే మోదీ ప్రభుత్వం ప్రజల్ని కూడా తాకట్టు పెడుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 1.06లక్షల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు కనీస వేతనం ఇవ్వాలనీ, న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆరు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తుంటే జగన్ ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుండా సమ్మెను ఉక్కుపాదంతో అణచివేయడానికి జగన్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. అందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాల తలుపుల తాళాలు సచివాలయ సిబ్బందితో పగుల కొట్టిస్తున్నారనన్నారు. ఇలా చేయడం అప్రజాస్వామికమని ఓబులేసు అన్నారు. జగన్ బటన్ నొక్కుడు కార్యక్రమానికి ఒక్కోసారి రూ.15కోట్లు ఖర్చు చేస్తున్నారని... ఈ విధానానికి జగన్ స్వస్తి చెబితే అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు పెంచవచ్చన్నారు. తెలంగాణ కంటే రూ.1,000 ఎక్కువ జీతం ఇస్తానని అంగన్‌వాడీలకు హామీ ఇచ్చిన జగన్ ఎందుకు జీతాలు పెంచడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు చెందిన రూ.500కోట్లు కూడా జగన్ ప్రభుత్వం అడ్డదారుల్లో ఇతర అవసరాలకు వాడుకున్నదన్నారు. ఈ సొమ్మును భవన నిర్మాణ కార్మికుల కోసమే వెచ్చించాలని ఓబులేసు డిమాండు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. హరినాథరెడ్డి మాట్లాడుతూ, దేశంలో పార్లమెంటు భవన రక్షణకే దిక్కులేదని... అలాంటి ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు ఏవిధంగా రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అందుకే అసహనం చెందిన నిరుద్యోగులు ఒక బృందంగా ఏర్పడి పార్లమెంటుపై దాడికి యత్నించారన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా అణచివేత ధోరణికి పాల్పడుతోందన్నారు. మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఢిల్లీ రైతాంగం చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని హరినాథరెడ్డి అభిప్రాయపడ్డారు. ఇక రాష్ట్రంలో జగన్ నిరంకుశ పాలన చేస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వం సమ్మె హక్కును పూర్తిగా కాలరాస్తోందన్నారు. జగన్ మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రజలకు త్రిశంకు స్వర్గం చూపుతున్నారన్నారు. మోదీ, జగన్ పాలనలో దళితులు, మహిళలపై దాడులు పెరిగి పోయాయన్నారు.

విద్యార్థులపై నోరుపారేసుకున్న కేరళ గవర్నర్

తిరువనంతపురం: కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ శనివారం కాలికట్ వర్సిటీని సందర్శించారు. అక్కడ తన వాహనాన్ని ఎస్ఎఫ్ఐ విద్యార్థులు అడ్డుకొని నిరసన తెలుపగా వారిపై గవర్నర్ నోరుపారేసుకున్నారు. నేరస్తులు, గూండాలు అంటూ తీవ్ర పదజాలంతో విద్యార్థులను దూసించారు. తనపై దాడికి ప్రయత్నించిన విద్యార్థుల వెనుక ముఖ్యమంత్రి పినరయి విజయన్ హస్తం ఉందని ఆరోపించారు. విజయనే నిరసనకారులను తనపైకి ఉసిగొలిపారని విమర్శించారు. యూనివర్సిటీల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూలాలున్న వ్యక్తులను వివిధ పదవులకు నామినేట్ చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కాలికట్ యూనివర్సిటీ సందర్శనకు వచ్చిన ఆయనను ఎస్ఎఫ్ఐ విద్యార్థులు అడ్డుకున్నారు. నిరసన తెలిపారు. తాను రాష్ట్రపతికి మాత్రమే జవాబుదారినని... విద్యార్థుల ముసుగులో ఉన్న నేరస్థులకు కాదని వ్యాఖ్యానించారు.

పలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని శాంతి చర్చలతో పరిష్కరించాలి

ముగిసిన ఎంఎల్‌పీఐ (రెడ్‌ఫ్లాగ్) జాతీయ మహాసభలు

జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎం.ఎస్.జయకుమార్

విశాలాంధ్ర-విజయవాడ: పలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని శాంతి చర్చల ద్వారా పరిష్కరించేలా ప్రపంచ దేశాలు ప్రయత్నించాలని ఎంఎల్‌పీఐ (రెడ్‌ఫ్లాగ్) పార్టీ తీర్మానం చేసింది. ఎంఎల్‌పీఐ(రెడ్ ఫ్లాగ్) పార్టీ నాలుగు రోజులుగా స్థానిక పూర్ణనందంపేట ఎస్.కె.చాంద్ హాల్లో నిర్వహించిన 10వ జాతీయ మహాసభలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. అంతర్జాతీయ, జాతీయ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌పీఐ(రెడ్‌ఫ్లాగ్) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎం.ఎస్.జయకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ కేంద్ర కమిటీ ఆమోదించిన వివిధ తీర్మానాలను ఆయన మీడియాకు వెల్లడించారు. దేశంలో బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా బీజేపీయేతర పార్టీలను ఏకం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాశ్మీర్

విషయంలో పార్లమెంటులోగానీ, కాశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీలోగానీ ఆ రాష్ట్ర ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఏకపక్షంగా ఆర్టికల్ 370, 35(ఏ) రద్దు చేయటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగాన్ని, మానవ హక్కులను కాపాడాల్సిన కోర్టులు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్ విషయంలో అమరావతిని రాజధానిగా ఉంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏపీలో బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న టీడీపీ, జనసేన, వైసీపీకి వ్యతిరేకంగా వామపక్ష ఐక్యకూటమిని బలోపేతం చేయాలన్నారు. రైతాంగం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను సంఘటితంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించారు. నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ మహాసభల్లో డోలక్ యాదగిరి బృందం విప్లవ గీతాలు ఆలపించి సభికులను ఉత్తేజితులను చేశారు. కేంద్ర కమిటీ సభ్యులుగా కేరళ రాష్ట్రం నుంచి పీసీ ఉన్ని చెక్కన్, థామస్ ఫ్రెడీ, చార్లెస్ జార్జి, పీకే వేణుగోపాల్, మోహన్ దాస్, టీబీ మిని, ఎం.కె.తంకప్పన్, అలాగే, బసవలింగప్ప, అయ్యప్ప హుగ్గర్ (కర్నాటక), సి.చంద్రశేఖర్, ఆదేశ్ బన్సోడే (మహారాష్ట్ర), రాజ్ మెహతా, రాకేష్ వర్మ (పంజాబ్), బద్రి ప్రసాద్ మిశ్రా (మధ్య ప్రదేశ్), మరీదు ప్రసాద్ బాబు (ఆంధ్ర ప్రదేశ్), నాగరాజు (తమిళనాడు) ఎన్నికయ్యారు. ఈ మహాసభలకు దేశంలోని 8 రాష్ట్రాల నుంచి 100 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

హమాస్‌కే యువ అమెరికన్ల మొగ్గు

వాషింగ్టన్: ఇజ్రాయిల్ వద్దు-పలస్తీనా వద్దు అని అమెరికాలోని 18-24 ఏళ్లవారు చెబుతున్నారు. అక్టోబరు7న హమాస్ జరిపిన దాడి సమర్ధనీయమని అంటున్నారు. ఇజ్రాయిల్‌ను పలస్తీనియన్లకు అప్పగించేయాలని, హమాస్ పాలన ఉండాలని ప్రతిపాదిస్తున్నారు. ఇటీవల జరిగిన హార్వర్డ్- హారిస్ సర్వేలో 18-24 ఏళ్ల వారిలో 51శాతం మంది హమాస్ పాలనకే మొగ్గు చూపారు. ఇజ్రాయిల్‌ను రద్దుచేసి పలస్తీనాకు అప్పగించేయాలని, పరిపాలన బాధ్యతలను హమాస్‌కు అప్పగించాలని అభిప్రాయపడ్డారు. 32శాతం మంది 'టూ స్టేట్' పరిష్కారానికి అనుకూలంగా ఉంటే పలస్తీనియన్లను అరబ్ దేశాలు స్వీకరించాలని 17శాతం మంది అన్నారు. 65 ఏళ్లు, ఆపై వయస్సుగల నాలుగు శాతం మంది మాత్రం ఇజ్రాయిల్‌కు అంతం పలకడమే శ్రేయస్కరమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మధ్య వయస్సుగల వారు, వృద్ధుల్లో కొందరు 'టూ స్టేట్'కు అనుకూలంగా ఉన్నారు. అయితే పాత తరంతో కొత్త తరం పూర్తిగా విభేదిస్తుండటంతో ఈ సర్వే ఫలితాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయి.యువతరం (18-24 ఏళ్లవారు)లో 60శాతం మంది అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడిని సమర్ధించారు. ఇది పలస్తీనాకు జరిగిన దానికి ప్రతిస్పందనగా వారు అభివర్ణించారు. అమెరికన్లలో 27శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. గాజాలో పలస్తీనియన్ల మారణహోమాన్ని ఇజ్రాయిల్ సృష్టిస్తోందని 60శాతం మంది యువత అన్నారు. యూదులను వేధించేవారిగా 67 శాతం మంది (18-24 ఏళ్లవారు) అభిప్రాయపడ్డారు. హమాస్‌కు మద్దతిచ్చే విషయంలో యువతరానికి, పాత తరం అమెరికన్లకు మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. 80శాతం అమెరికన్లు ఇజ్రాయిల్‌కు మద్దతివ్వగా 18-24ఏళ్ల వారిలో సగం మందికిపైగా హమాస్ వైపు నిలిచారు. అమెరికాలోని అన్ని వయస్సుల వారు ఈ పోరును నిశితంగా గమనిస్తున్నారని, ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారని కూడా ఈ సర్వేలో వెల్లడైంది. ఇదిలావుంటే, హమాస్‌కు యువతలో సానుభూతి రావడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కీలకమన్న వాదన వినిపిస్తోంది.

పలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం

జేవీ సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: ప్రపంచంలోని అనేక దేశాల్లో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, జాతి విముక్తి కోసం మూడు దశాబ్దాలుగా జరుగుతున్న ఉద్యమాలకు భిన్నమైనది పలస్తీనా విముక్తి పోరాటమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం విశాలాంధ్ర బుక్ హౌస్, మధ్య తరగతి శాఖ సంయుక్త సారధ్యంలో పలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో ఎన్‌జీవో హోమ్‌లో మధ్య తరగతి శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్న కేశవులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, విశ్రాంత ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, మానవ హక్కుల వేదిక నాయకుడు బాషా, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాదా గాంధీ, వైసీపీ నాయకుడు నదీం అహమ్మద్, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ పలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల మధ్య జరుగుతున్న అమానుష యుద్ధవాతావరణం, దాడుల నేపథ్యంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. పలస్తీనా భూభాగాన్ని నిర్ధారించి, వారికి స్వయం పరిపాలన సౌలభ్యం కల్పించాలని అగ్ర రాజ్యాలు నిర్ణయించాయన్నారు. అయితే ఆ దాఖలాలు ఎక్కడా కనబడలేదన్నారు. దశాబ్దాలుగా పలస్తీనా ప్రజలు లక్షలాది మంది తరిమివేయబడి, ఊచకోతకు గురై, మందులు నిత్యావసరాలు సైతం అందక దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో గత 50 ఏళ్ల ప్రపంచ చరిత్రలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, జాతి విముక్తి కోసం జరిగిన ఏళ్ల తరబడి ఉద్యమాలు, ఆయా దేశాల మధ్య సమన్వయం కోసం పోరాడి కృషి చేసిన అప్పటి ప్రపంచ నాయకులను గుర్తు చేశారు. పలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం అనే పుస్తకంలో ఇప్పటి వరకు ఆ దేశంపై జరిగిన దాడులు, నష్టం తదితర అంశాలపై ప్రచురితమైన వ్యాసాల సంకలనం పొందుపరచారని, ప్రజలందరూ ఈ పుస్తకాన్ని చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత, ఆదర్శవాదం వీడొద్దు

- ఆధునికత, సంప్రదాయాల మధ్య సమతుల్యత ముఖ్యం
- దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్: సాయుధ దళాలు ఆధునికతను సంతరించుకుంటూనే సంప్రదాయాలను కొనసాగించాలని, ఈ రెండింటి మధ్య సమతుల్యత ఉండేలా చూసుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జరిగిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకొని నూతన బాధ్యతలు చేపట్టబోయే అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, ఆదర్శవాదాన్ని వీడవద్దని వారికి హితవుపలికారు. ఎల్లప్పుడు పారే నదిలా ఉండాలేగానీ ప్రవహించని నీటిలా ఉండిపోరాదని అన్నారు. ఇందుకోసం కొత్తతానికి, సంప్రదాయాలకు మధ్య సమతుల్యతను కాపాడుకోవాలని సూచించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించండి కానీ మీ మూలాలను మర్చిపోవద్దని కేడట్లకు హితవు పలికారు. అంతకుముందు రాజ్‌నాథ్ సింగ్‌కు చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి స్వాగతం పలికారు. శిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది మహిళలతో సహా 213 మంది ఫ్లైట్ కేడట్లు భారత వైమానిక దళంలోని వేర్వేరు శాఖల్లో నియామకాలు పొందారు. ఫ్లైయింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న భారత నావికా దళం నుంచి ఎనిమిది మంది అధికారులు, ఇండియన్ కోస్ట్‌గార్డ్ నుంచి తొమ్మిది మంది, మిత్ర దేశాల నుంచి ఇద్దరికి 'వింగ్స్'ను ప్రదానం చేశారు. 'కమిషనింగ్ సెరమనీ'లో భాగంగా ఫ్లైట్ కేడట్లకు 'స్ట్రైప్స్'ను రక్షణమంత్రి అందజేశారు. కోర్సులో మెరిట్ సాధించిన ఫ్లైయింగ్ అధికారి అతుల్ ప్రకాశ్‌కు రాష్ట్రపతి ఫలకాన్ని, చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ స్వార్డ్ ఆఫ్ హానర్ (గౌరవ ఖడ్గం)ను బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్‌యూ-30ఎంకేఐ, 'సారంగ్' హెలికాప్టర్ల బృందం, 'సూర్యకిరణ్' బృందం చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మీకు మీరే సాటి...: ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే

హైదరాబాద్‌లోని మిలటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంసీఈఎంఈ) 104వ స్నాతకోత్సవంలో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ పాండే పాల్గొని యువ అధికారులకు వారు నిర్వర్తించాల్సిన బాధ్యతలు, ఎదుర్కోవాల్సిన పరిస్థితుల గురించి అవగాహన కల్పించారు. నిరంతరం విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని, శారీరకంగా దృఢంగా, మానసికంగా బలంగా ఉండాలని సూచించారు. నలుగురికి ఆదర్శంగా ఉండాలని, మీకు మీరే సాటిగా, దేశానికి స్ఫూర్తిగా నిలవాలని యువ అధికారులను పాండే ప్రోత్సహించారు. రాయల్ భూటాన్ ఆర్మీ అధికారులు సహా టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సు చేసిన అధికారులు 33 మందికి బీటెక్ పట్టాలను అందజేశారు.

వన్డేలో టీమిండియా జోరు

- సఫారీలపై ఘన విజయం
- బౌలింగ్, బ్యాటింగ్‌లో అదరగొట్టిన ఆటగాళ్లు
- 116 పరుగులకే దక్షిణాఫ్రికా ఆల్ ఔట్

జొహన్నెస్‌బర్గ్: వన్డే సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. దక్షిణాఫ్రికా, జోహన్నెస్ బర్గ్‌లో జరిగిన మ్యాచ్‌లో సొంత గడ్డపైనే సఫారీలను చిత్తు చేసింది. బౌలింగ్, బ్యాటింగ్‌లోనూ భారత ఆటగాళ్లు రాణించారు. ఫలితంగా మూడు మ్యాచుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 116 పరుగులకే దక్షిణాఫ్రికాను కుప్పకూల్చింది. అనంతరం బ్యాటింగ్ చేసి అదరగొట్టింది. 17 ఓవర్లలోపే లక్ష్యాన్ని ఛేదించింది. డెబ్యూ ప్లేయర్ సాయి సుదర్శన్ (55), శ్రేయస్ అయ్యర్ (52)తో రాణించడం లక్ష్యం సులువు అయింది. తొలుత టాస్ గెలిచిన సరఫారీలు టీమిండియా బౌలర్లు విసిరే బంతులను ఎదుర్కొనేందుకు తడబడ్డారు. అర్షదీప్ సింగ్, ఆవేశ్ ఖాన్ బౌలింగ్‌కు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. 27.3 ఓవర్లలో 116 పరుగులకు దక్షిణాఫ్రికా జట్టు ఆల్ ఔట్ అయింది. అర్షదీప్ సింగ్ 5 వికెట్లు, ఆవేశ్ ఖాన్ 4, కుల్‌దీప్ యాదవ్ ఒకటి చొప్పున వికెట్లు తీశారు. అనంతరం బ్యాంటింగ్ చేసిన టీమిండియా సులువుగా విజయం సాధించింది. రుతురాజ్ గైక్వాడ్ (5) స్వల్ప స్కోరుకే ఔట్ అయినా డెబ్యూ ప్లేయర్ సాయి సుదర్శన్ (55), శ్రేయస్ అయ్యర్ (52) భారత్‌ను గెలిపించారు. విజయానికి మరో ఆరు పరుగులు అవసరమైన దశలో అయ్యర్ ఔట్ అయ్యాడు. దీంతో తిలక్‌వర్మ (1)తో కలిసి సాయి సుదర్శన్ తన తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీ కొట్టాడు. ఇదిలావుంటే, బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు దక్షిణాఫ్రికా జట్టు గులాబీ రంగు జెర్సీలో ఈ మ్యాచ్ ఆడింది. ఇంతకుముందు ఈ రంగు జెర్సీలో ఆడిన 11 మ్యాచులలో 10 మ్యాచుల్లో గెలిచింది. తాజా ఓటమితో 'పింక్ జెర్సీ'లో ఓటముల సంఖ్య రెండుకు పెరిగింది. కాగా, రెండవ వన్డే మంగళవారం జరగనుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.